తొలివెలుగు

TGTEL/26/A6221

TOLE VELUGGU JATIYAPATRIKA

ప్రతి అక్షరం.. ప్రజల పక్షం

జాతీయ పత్రిక

యాదాద్రి భువనగిరి | సంపుటి: 01 | సంచిక : 10 | శుక్రవారం | 7-8-2026 | పేజీలు: 08 | వెల: రూ.2/-

Yadadri Bhuvanagiri | Volume:01 | Issue:10 | Friday | 7-8-2026 | Pages:08 | Cost:2/-

నిరసన తెలిపే యువత దేశ వ్యతిరేకులు కాదు

- నిరసనలు తెలిపే యువతరం దేశ వ్యతిరేకులు కాదని స్పష్టం చేసిన మోహన్ భగవత్
- జెన్-జెడ్ మనవాళ్లే, వారి సమస్యలను పరిష్కరించాలని సూచన
- ప్రస్తుత తరం కంటే యువత ఎంతో నిజాయితీపరులని వ్యాఖ్య
- నీట్ అక్రమాలపై విద్యార్థుల నిరసనల నేపథ్యంలో భగవత్ వ్యాఖ్యలకు ప్రాధాన్యం

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు..

- ఆగస్టు 15న రేవంత్ రెడ్డి చేతుల మీదుగా పంపిణీ
- సంగారెడ్డిలో లాంఛనంగా ప్రారంభించనున్న ముఖ్యమంత్రి
- అన్ని నియోజకవర్గాల్లో ఏకకాలంలో పంపిణీ కార్యక్రమం
- డెబిట్ కార్డు సైజులో బార్‌కోడ్‌తో రానున్న కొత్త కార్డులు

తెలంగాణ రాష్ట్రంలోని అర్హులైన కుటుంబాలకు ప్రభుత్వం తీపి కబురు అందించింది. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను పురస్కరించుకుని ఆగస్టు 15న కొత్త రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని అధికారికంగా ప్రారంభించనుంది. సంగారెడ్డి వేదికగా జరగనున్న రాష్ట్రస్థాయి కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ఈ పంపిణీని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ కార్యక్రమం వివరాలను నీటిపారుదల, పౌర సరఫరాల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి వెల్లడించారు. ఇందుకు సంబంధించిన షెడ్యూల్‌ను ముఖ్యమంత్రి ఇప్పటికే ఆమోదించారని ఆయన తెలిపారు. ఆగస్టు 15న మధ్యాహ్నం 2 గంటల నుంచి 4 గంటల మధ్య రాష్ట్రవ్యాప్తంగా

- మిగతా 2వ పేజీలో

బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు: పేర్ని నాని

- వైసీపీ దీక్షా శిబిరంపై అధికారమదంతో బొండా ఉమా దాడి చేశారన్న పేర్ని నాని
- ఇలాంటి దాడులు రాష్ట్ర చరిత్రలో మాయని మచ్చలా మిగిలిపోతాయని వ్యాఖ్య
- ప్రభుత్వానికి రోజులు దగ్గరపడ్డాయన్న పేర్ని నాని

రాహుల్ గాంధీకి ఫోన్ చేసిన కిరణ్ రిజిజు

- డీలిమిటేషన్ బిల్లుకు మద్దతు కోరిన కేంద్రం
- మహిళా రిజర్వేషన్ల అమలు కోసమే ప్రయత్నమన్న రిజిజు
- మిత్రపక్షాలతో చర్చించి నిర్ణయం చెబుతానన్న రాహుల్
- కాంగ్రెస్ వైఖరిలో మార్పు లేదన్న వేణుగోపాల్

వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలు చాలు

- రాజకీయం ముసుగులో జగన్ నేరాలకు పాల్పడుతున్నారన్న చంద్రబాబు
- డీఎస్సీపై వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తున్నారని విమర్శ
- వైసీపీ దుష్ప్రచారాన్ని తిప్పికొట్టాలని కూటమి శ్రేణులకు పిలుపు

రాజకీయం ముసుగులో మాజీ సీఎం జగన్ తీవ్ర నేరాలకు పాల్పడుతున్నారని, వైసీపీ నేతల అరాచకాలకు చెక్ పెట్టడానికి తమకు కేవలం రెండు నిమిషాలు చాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఘాటుగా హెచ్చరించారు. అమరావతి సచివాలయంలో జరిగిన కేబినెట్ సమావేశంలో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. పారదర్శకంగా నిర్వహించిన డీఎస్సీ ప్రక్రియపై కోర్టు చివాట్లు పెట్టినా పట్టించుకోకుండా వైసీపీ శ్రేణులు కావాలనే వివాదాలు సృష్టిస్తూ రాద్ధాంతం చేస్తున్నాయని ఆగ్రహం వ్యక్తం చేశారు.

- మిగతా 2వ పేజీలో



చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

- 'నేతన్న సేవలో' పథకం కింద ప్రతి చేనేత కుటుంబానికి రూ.25 వేల సాయం
- చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చేతుల మీదుగా పథకం ప్రారంభం
- రాష్ట్రవ్యాప్తంగా 71,536 కుటుంబాలకు రూ.179 కోట్ల ప్రయోజనం
- ఉచిత విద్యుత్, 50 ఏళ్లకే పింఛన్లతో పాటు పలు సంక్షేమ పథకాల అమలు
- చీరాల పర్యటనలో నేతన్నలతో ముఖాముఖి భేటీ కానున్న సీఎం చంద్రబాబు

ఆంధ్రప్రదేశ్‌లో చేనేత కార్మికుల సంక్షేమానికి, వారి వృత్తిని పరిరక్షించేందుకు ప్రజా ప్రభుత్వం మరో కీలక ముందడుగు వేసింది. చేనేత కుటుంబాలను ఆర్థికంగా ఆదుకునే లక్ష్యంతో 'నేతన్న సేవలో' అనే సరికొత్త పథకానికి శ్రీకారం చుట్టింది. 12వ జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆగస్టు 7వ తేదీన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు బాపట్ల జిల్లా చీరాలలో ఈ పథకాన్ని లాంఛనంగా ప్రారంభించనున్నారు. ఈ పథకం కింద రాష్ట్రంలోని అర్హులైన ప్రతి చేనేత కుటుంబానికి రూ. 25,000 చొప్పున ఆర్థిక సాయం అందనుంది.

- మిగతా 2వ పేజీలో

మన గురువు జయశంకర్.. రేవంత్‌కు మాత్రం పొరుగు రాష్ట్ర సీఎం

- 32 నెలల్లో 75 సార్లు ఢిల్లీకి వెళ్లి తెలంగాణకు తెచ్చిందేమిటి?: కేటీఆర్
- గాడ్ ఫాదర్‌లా కేసీఆర్‌కు జయశంకర్ మార్గనిర్దేశం చేశాడు
- తెలంగాణను మళ్లీ కేసీఆర్ చేతిలో పెట్టడమే జయశంకర్‌కు నివాళి

హైదరాబాద్: 'మనకేమో గురువు జయశంకర్.. కానీ సీఎం రేవంత్‌కు గురువు పొరుగు రాష్ట్ర ముఖ్యమంత్రి. కనీసం 'జై తెలంగాణ'అనేందుకు కూడా రేవంత్‌కు మనసొప్పదు. రేవంత్ సీఎం పదవి చేపట్టిన తర్వాత

దోచింది దాచేందుకే విదేశాలకు..

- సీఎం, మంత్రులపై బీజేఎల్పీ నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ఆరోపణలు
- టెండర్లు, కమీషన్లు, భూకేటాయింపులపై స్వతంత్ర దర్యాప్తునకు డిమాండ్

పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

- పరామర్శల పేరుతో బలప్రదర్శన చేస్తున్నారని ఆరోపణ
- నిందితులను పరామర్శిస్తున్నారని విమర్శ
- జగన్ పర్యటనల వీడియోలు ప్రదర్శించిన అనిత
- అంబులెన్స్‌కు దారి ఇవ్వలేదని వైకాపాపై ఆరోపణ
- పరామర్శల వల్ల ముగ్గురు చనిపోయారని ఆరోపణ

దేశవ్యాప్తంగా 'క్యా బోల్తీ పబ్లిక్?'

- సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' ప్రచారం
- దేశవ్యాప్తంగా ప్రజలతో నేరుగా సంభాషణ
- విద్య వ్యాణిజ్యీకరణపై సీజేపీ విమర్శలు
- ఫీజుల భారం తగ్గించాలని డిమాండ్
- నిరుద్యోగాన్ని ప్రధాన సమస్యగా ప్రస్తావన
- ఎన్నికలకు దూరంగా ఉంటామని స్పష్టీకరణ

జంతర్‌మంతర్‌లో నీట్ ప్రశ్నాపత్రం లీకేలపై చేపట్టిన ఆందోళనల తర్వాత దేశవ్యాప్తంగా ప్రజల్లోకి వెళ్లాలని కాక్రోచ్ జనతా పార్టీ (సీజేపీ) నిర్ణయించింది. సెప్టెంబర్ నుంచి 'క్యా బోల్తీ పబ్లిక్?' పేరుతో దేశవ్యాప్త ప్రచార కార్యక్రమం చేపడుతున్నట్లు పార్టీ వ్యవస్థాపకుడు అభిజిత్ దిప్కే ప్రకటించారు.

- మిగతా 2వ పేజీలో

వైసీపీ అరాచకాలకు చెక్ పెట్టడానికి రెండు నిమిషాలుచాలు

(మొదటి పేజీ తరువాయి)

డీఎస్సీ వ్యవహారంలో వైసీపీ చేస్తున్న దుష్ప్రచారాన్ని, తప్పుడు ఆరోపణలను క్షేత్రస్థాయిలో గట్టిగా తిప్పికొట్టాలని టీడీపీ నేతలు, శ్రేణులకు సీఎం సూచించారు. జగన్ ఎక్కడైనా పరామర్శలకు వస్తున్నారంటేనే అసలు ఏం జరుగుతుందోనని జనాలు భయపడే పరిస్థితి దాపురించిందని ఎద్దేవా చేశారు.

పరామర్శల పేరుతో బలప్రదర్శన ఎందుకు?

వైఎస్ఆర్సీపీ అధినేత వైఎస్ జగన్మోహన్ రెడ్డి పరామర్శల పేరిట బలప్రదర్శన చేస్తున్నారని ఏపీ హోంమంత్రి వంగలపూడి అనిత విమర్శించారు. ఆయన బయట అడుగు పెడితే విధ్వంసం, అరాచకాలు జరుగుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి చర్యలతో ప్రజలకు ఏం సందేశం ఇస్తున్నారని ప్రశ్నించారు. రాష్ట్ర సచివాలయంలో గురువారం నిర్వహించిన మీడియా సమావేశంలో అనిత మాట్లాడారు. బాధితులను కాకుండా నిందితులను పరామర్శించడం ఏంటని జగన్ను నిలదీశారు. ఆయన పర్యటనల్లో చోటుచేసుకున్న ఘటనలకు సంబంధించిన వీడియోలను మీడియాకు ప్రదర్శించారు. 'వైకాపా నేతలు బాధ్యతాయుతంగా వ్యవహరించాలి. బెట్టింగ్లో నష్టపోయి మృతి చెందిన వ్యక్తి విగ్రహావిష్కరణకు జగన్ వెళ్లారు. ఆయన కారు కింద ఓ వ్యక్తి పడినా పట్టించుకోకుండా వెళ్లిపోయారు. అంబులెన్స్కు దారి ఇవ్వకుండా వైకాపా కార్యకర్తలు ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. పరామర్శల సమయంలో మహిళలపై కూడా దాడులు జరుగుతున్నాయి. పోలీసులను బ్లాక్మెయిల్ చేసే ప్రయత్నాలు చేస్తున్నారు" అని ఆరోపించారు. పరామర్శల పేరుతో నిర్వహిస్తున్న బలప్రదర్శనల వల్ల ఇప్పటికే ముగ్గురు ప్రాణాలు కోల్పోయారని అనిత అన్నారు. ప్రజలకు ఉపయోగపడే ఒక్క మంచి పని అయినా జరిగిందా అని జగన్ను ప్రశ్నించారు.

రాహుల్ గాంధీకి కేంద్ర మంత్రి ఫోన్..

మహిళా రిజర్వేషన్ల అమలుకు మార్గం సుగమం చేయాలనే లక్ష్యంతో కేంద్ర ప్రభుత్వం ప్రతిపక్షాల మద్దతు కూడగట్టే ప్రయత్నాలు ముమ్మరం చేసింది. ఇందులో భాగంగా పార్లమెంటరీ వ్యవహారాల మంత్రి కిరణ్ రిజిజు.. లోక్సభ ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీకి ఫోన్ చేసి నియోజకవర్గాల పునర్విభజన బిల్లుకు మద్దతు ఇవ్వాలని కోరినట్లు సమాచారం. పార్లమెంట్ వర్షాకాల సమావేశాల సందర్భంగా ఈ అంశంపై రాహుల్ గాంధీతో రిజిజు మాట్లాడటం ఇది మూడోసారి అని తెలుస్తోంది. బిల్లుకు ప్రతిపక్షం సహకరిస్తే మహిళా రిజర్వేషన్ల అమలు వేగవంతమవుతుందని ఆయన వివరించినట్లు సమాచారం. లేదంటే మహిళల్లో అసంతృప్తి పెరిగే అవకాశం ఉందని కూడా రిజిజు చెప్పినట్లు తెలుస్తోంది. అయితే ఈ అంశంపై రాహుల్ గాంధీ ఎలాంటి స్పష్టమైన హామీ ఇవ్వలేదని సమాచారం. ముందుగా కాంగ్రెస్ మిత్రపక్షాలు, ఇండియా కూటమి భాగస్వాములతో చర్చించి తర్వాత పార్టీ వైఖరిని వెల్లడిస్తామని రిజిజుకు చెప్పినట్లు తెలిసింది. అయితే డీలిమిటేషన్ బిల్లుపై కాంగ్రెస్ వైఖరిలో ఎలాంటి మార్పు లేదని ఆ పార్టీ ఎంపీ కే.సి. వేణుగోపాల్ బుధవారం స్పష్టం చేశారు. గత పార్లమెంట్ సమావేశాల్లో తీసుకున్న నిర్ణయానికే కట్టుబడి ఉన్నామని చెప్పారు. బడ్జెట్ సమావేశాల సమయంలో ప్రవేశపెట్టిన రాజ్యాంగ సవరణ బిల్లు లోక్సభలో ఆమోదం పొందలేదు. మహిళా రిజర్వేషన్ల పేరుతో దేశ రాజకీయ, జనాభా సమీకరణాలను మార్చే ప్రయత్నం జరుగుతోందనే ఆందోళనతోనే బిల్లును వ్యతిరేకించినట్లు కాంగ్రెస్ గతంలో తెలిపింది. అయితే ప్రస్తుతం ఉన్న లోక్సభ స్థానాల పరిధిలోనే మహిళా రిజర్వేషన్లు అమలు చేస్తే మద్దతు ఇస్తామని కాంగ్రెస్ ఇప్పటికే స్పష్టం చేసింది.

దేశవ్యాప్తంగా 'క్యా బోల్తే పబ్లిక్?'

ఛత్రపతి శంభాజీనగర్లో జరిగిన రెండు రోజుల జాతీయ కోర్ కమిటీ సమావేశం ముగిసిన తర్వాత దీప్కే మీడియాతో మాట్లాడారు. విద్యార్థులు, యువత, సామాన్య ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను నేరుగా తెలుసుకొని ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్లడమే ఈ కార్యక్రమం ప్రధాన ఉద్దేశమని చెప్పారు. దేశంలో విద్య పూర్తిగా వ్యాపారంగా మారిందని దిప్కే విమర్శించారు. మొదటి తరగతి ప్రవేశానికే రూ.లక్షల ఫీజులు, భారీ విరాళాలు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. మధ్యతరగతి, ఉద్యోగ కుటుంబాలు పిల్లలను చదివించడం భారంగా మారిందన్నారు. ఉన్నత విద్య, కోచింగ్ పేరుతో తల్లిదండ్రులు అప్పుల పాలవుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ విద్యాసంస్థలను బలోపేతం చేయాల్సిన అవసరం ఉందని చెప్పారు. విద్య ప్రతి ఒక్కరి హక్కని, అది అందరికీ అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. నీట్ అక్రమాలపై జరిగిన ఆందోళనల్లో నిరుద్యోగ యువత పెద్ద ఎత్తున పాల్గొన్నారని దిప్కే గుర్తుచేశారు. దేశంలో నిరుద్యోగం కూడా అత్యంత కీలక సమస్యగా మారిందన్నారు. న్యాయవ్యవస్థ, ఎన్నికల సంఘంపై ప్రజల్లో విశ్వాసం దెబ్బతింటోందని వ్యాఖ్యానించారు. అధికారాన్ని ప్రశ్నించే స్వతంత్ర పాత్రను మీడియా పోషించాలని కోరారు. సీజేపీ ఎన్నికల్లో పోటీ చేయదని, ప్రజల హక్కుల పరిరక్షణ, పాలనలో సంస్కరణల కోసం ఒత్తిడి తెచ్చే శక్తిగా పనిచేస్తుందని దిప్కే స్పష్టం చేశారు.

చేనేతలకు సీఎం చంద్రబాబు కానుక.. ఒక్కో కుటుంబానికి రూ.25 వేల ఆర్థిక సాయం

(మొదటి పేజీ తరువాయి)

దీని ద్వారా రాష్ట్రవ్యాప్తంగా 71,536 చేనేత కుటుంబాలకు మొత్తం రూ.179 కోట్లు జమ కానున్నాయి. ఎన్నికల మేనిఫెస్టోలో హామీ ఇవ్వనప్పటికీ, చేనేత వృత్తిని, దాని వారసత్వాన్ని కాపాడాలనే సంకల్పంతో ప్రభుత్వం ఈ బృహత్తర పథకాన్ని అమలు చేస్తోంది. ఈ కొత్త పథకంతో పాటు ఇప్పటికే ప్రభుత్వం చేనేత రంగానికి అనేక విధాలుగా మద్దతు అందిస్తోంది. చేనేత కుటుంబాలకు నెలకు 200 యూనిట్లు, పవర్లూమ్లకు 500 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్ సరఫరా చేస్తోంది. దీనివల్ల 62,541 చేనేత కుటుంబాలు, 10,032 పవర్లూమ్ యూనిట్లకు ప్రయోజనం చేకూరుతోంది. ఇందుకోసం ప్రభుత్వం ఏటా రూ.150 కోట్లు వెచ్చిస్తోంది. అంతేకాకుండా, చేనేతల వృద్ధాప్య పింఛన్ వయసును 50 ఏళ్లకు తగ్గించి, రాష్ట్రవ్యాప్తంగా 85 వేల మందికి నెలకు రూ.4,000 చొప్పున పింఛన్ అందిస్తోంది. ఈ పింఛన్ల కోసం ఏటా రూ.420 కోట్లు ఖర్చు చేస్తోంది. చేనేత కార్మికులకు ప్రభుత్వం అందిస్తున్న ఈ భరోసా వారి జీవనోపాధికి అండగా నిలుస్తోంది. చేనేత రంగాన్ని మౌలికంగా బలోపేతం చేసేందుకు కూడా ప్రభుత్వం దీర్ఘకాలిక చర్యలు చేపట్టింది. రాష్ట్రంలోని 109 ప్రాథమిక చేనేత సహకార సంఘాలకు క్యాష్ క్రెడిట్ రూపంలో రూ.79 కోట్లు అందించింది. ఉప్పాడలో ప్రత్యేక మౌలిక సదుపాయాల ప్రాజెక్టు, మంగళగిరిలో హ్యాండ్లూమ్ పార్కు, రాజధాని అమరావతిలోని శాఖమూరులో చేనేత, హస్తకళల మ్యూజియం ఏర్పాటుకు కూడా ప్రభుత్వం ప్రణాళికలు సిద్ధం చేసింది. భవిష్యత్తులో విశాఖపట్నంలో రూ.4,200 కోట్ల భారీ పెట్టుబడితో సుస్థిర టెక్స్టైల్ రీసైక్లింగ్ యూనిట్ ఏర్పాటు కానుండటం ఈ రంగ అభివృద్ధికి మరింత ఊతమివ్వనుంది.

ముఖ్యమంత్రి పర్యటన వివరాలు

ఈ పథకం ప్రారంభోత్సవం సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు రేపు చీరాలలో పర్యటించనున్నారు. ఉదయం 10:30 గంటలకు తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి బయలుదేరి, వేటపాలెం మండలం కొత్తపేటకు చేరుకుంటారు. ఉదయం 11:05 గంటలకు అక్కడ ఏర్పాటు చేసిన ప్రజావేదిక సభలో పాల్గొని ప్రసంగిస్తారు. అనంతరం మధ్యాహ్నం 1:35 గంటలకు జాండ్రపేటలో ఏర్పాటు



చేసిన వర్క్షాప్లో నేతన్నలతో ముఖాముఖి నిర్వహిస్తారు. సాయంత్రం 4:10 గంటలకు కొత్తపేటలో టీడీపీ శ్రేణులతో సమీక్షా సమావేశంలో పాల్గొని, తిరిగి క్యాంపు కార్యాలయానికి చేరుకుంటారు.

మన గురువు జయశంకర్.. రేవంత్కు మాత్రం పొరుగు రాష్ట్ర సీఎం

(మొదటి పేజీ తరువాయి)

32 నెలల్లో 75 సార్లు ఢిల్లీకి వెళ్తూ సగటున 13 రోజులకోసారి ప్రదక్షిణలు చేస్తున్నారు. ఢిల్లీకి వెళ్లి వారిని యాచిస్తున్నడో లేక వారికే తెలంగాణ సొమ్మును ఇచ్చి వస్తున్నాడో తెలియదు. కానీ తెలంగాణకు ఢిల్లీ నుంచి ఏం తెస్తున్నాడో చెప్పడం లేదు. ఢిల్లీకి సామంతుల్లా తలవంచడం కాదు.. తెలంగాణ ఆత్మగౌరవాన్ని కాపాడే స్వతంత్ర నాయకత్వం కావాలి'అని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. తెలంగాణ భవన్లో ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి సందర్భంగా గురువారం నిర్వహించిన కార్యక్రమంలో కేటీఆర్ మాట్లాడారు. కేసీఆర్ను తెలంగాణ జాతిపితగా భావిస్తే, కేసీఆర్కు జయశంకర్ సార్ గాడ్ఫాదర్లా మార్గనిర్దేశం చేశారన్నారు. 'తెలంగాణ కోసమే పుట్టిన నిఖార్సయిన పార్టీ బీఆర్ఎస్ అయితే ప్రాణాలు పణంగా పెట్టి పోరాడే నాయకత్వం కేసీఆర్దే. పార్లమెంటులో ఓ బీజేపీ ఎంపీ తెలంగాణ ఏర్పాటును పాకిస్తాన్తో పోల్చినా బీజేపీ, కాంగ్రెస్ ఎంపీలు స్పందించలేదు. లోక్సభలో బీఆర్ఎస్ ఎంపీ ఉంటే ఆ వ్యాఖ్యలు చేసిన వారిని గల్లా పట్టి నిలదీసేవాడు. తెలంగాణ మళ్లీ ఢిల్లీ పార్టీల చేతుల్లో తల్లడిల్లుతోంది. ప్రముఖ ఆర్థికవేత్త, మాజీ ఐఏఎస్ అధికారి బీపీఆర్ విఠల్ అధ్యయనాల ప్రకారం తెలంగాణ మిగులు రాష్ట్రం. నీళ్లు, నిధులు పుష్కలంగా ఉన్నా ప్రభుత్వం వాటిని వినియోగించలేకపోతోంది. ఏపీ ప్రభుత్వం తెలంగాణకు చెందిన ఏడు ప్రాజెక్టులను రద్దు చేయాలని ప్రయత్నిస్తుంటే, జీఆర్ఎంబీ ద్వారా జరుగుతున్న అన్యాయాన్ని హరీశ్రావు ఇప్పటికే ఆధారాలతో వివరించారు. తొలి ఏడాదిలో రెండు లక్షల ఉద్యోగాలు ఇస్తామని చెప్పిన కాంగ్రెస్ ఇప్పుడు ఎందుకు అమలు చేయలేదో రేవంత్రెడ్డి, రాహుల్ గాంధీ సమాధానం చెప్పాలి. జైపాల్రెడ్డి జీవితంలో ఎన్నడూ జై తెలంగాణ అనలేదు. నిఖార్సయిన ఉద్యమకారులుగా కోదండరాం వంటి వారి పేర్లను కూడా రేవంత్ చెప్పడం లేదు. జయశంకర్ ఆశయాలకు విరుద్ధంగా కాంగ్రెస్ పాలన సాగుతోంది'అని కేటీఆర్ మండిపడ్డారు. 'స్వయం సమృద్ధి, ఆత్మగౌరవం, స్వయం పాలన అనే మూడు దశల ద్వారా తెలంగాణ సమాజాన్ని జయశంకర్ విశ్లేంచారు. యాచించి కాదు.. శాసించి తెలంగాణ సాధించాలి అనే స్ఫూర్తిని కేసీఆర్లో జయశంకర్ నింపారు. కాంగ్రెస్ తెలంగాణకు శాశ్వత శత్రువని, మూడు తరాలను ముంచిన పార్టీ కాంగ్రెస్ అని జయశంకర్ చెప్పేవారు.

తెలంగాణలో కొత్త రేషన్ కార్డులు..

(మొదటి పేజీ తరువాయి)

ఉన్న 119 అసెంబ్లీ నియోజకవర్గాల్లో ఏకకాలంలో కార్డుల పంపిణీ ప్రక్రియ కొనసాగుతుంది. జిల్లా యంత్రాంగం, పౌర సరఫరాల శాఖల సమన్వయంతో రెవెన్యూ డివిజనల్ అధికారులు (ఆర్డీవోలు) ఈ పంపిణీని పర్యవేక్షిస్తారు. లబ్ధిదారుల తుది జాబితాలను సిద్ధం చేసి, పంపిణీకి పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని అధికారులకు మంత్రి ఆదేశాలు జారీ చేశారు. నూతనంగా రూపకల్పన చేసిన ఈ రేషన్ కార్డులు లామినేషన్తో డెబిట్ కార్డు తరహాలో సౌకర్యవంతంగా ఉంటాయి. ప్రస్తుతం అమల్లో ఉన్న కార్డుల్లా కాకుండా, వీటిపై కుటుంబ సభ్యుల ఫొటోలు, పేర్లకు బదులుగా ఒక విశిష్ట సంఖ్య, బార్కోడ్ మాత్రమే ఉంటాయి. ఈ బార్కోడ్ను స్కాన్ చేయడం ద్వారా లబ్ధిదారులకు సంబంధించిన పూర్తి వివరాలను ఆన్లైన్లో పొందవచ్చు. నూతనంగా అర్హత పొందిన కుటుంబాలకు సంపూర్ణ ఆహార భద్రత కల్పించడమే ఈ కార్యక్రమ ప్రధాన ఉద్దేశం.

దోచింది దాచేందుకే విదేశాలకు..

హైదరాబాద్: దోచుకున్నది పంచుకొని దాచుకోవడానికే సీఎం సహా రాష్ట్ర మంత్రులు విదేశీ పర్యటనలకు వెళ్తున్నారని బీజేపీ శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. గురువారం బీజేపీ కార్యాలయంలో ఎమ్మెల్సీ సి.అంజిరెడ్డి, ఇతర నేతలతో కలిసి మహేశ్వర్రెడ్డి మీడియాతో మాట్లాడుతూ బీఆర్ఎస్ పాలనలో కీలక స్థానాల్లో పనిచేసిన అధికారులు, కాంట్రాక్టర్లు, మధ్యవర్తులనే కాంగ్రెస్ సర్కార్ కొనసాగిస్తోందని ఆరోపించారు. ప్రస్తుతం మూసీ రివర్ఫ్రంట్ చైర్మన్గా ఉన్న నరసింహారెడ్డి గతంలో కేటీఆర్తో సన్నిహితంగా వ్యవహరించారని, ఆయనతోపాటు హరీశ్రావు వద్ద దీర్ఘకాలం ఓఎస్డీగా పనిచేసిన అశోక్రెడ్డికి కాంగ్రెస్ ప్రభు త్వం కీలక బాధ్యతలు ఇవ్వడంలో ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. ఇది కాంగ్రెస్--బీఆర్ఎస్ మధ్య అవగాహనకు నిదర్శనమన్నారు. టెండర్లు, కమీషన్లు, భూకేటాయింపులు, షెల్ కంపెనీలు, నియామకాలు, సబ్ కాంట్రాక్ట్లు, మంత్రుల విదేశీ పర్యటనలపై స్వతంత్ర దర్యాప్తు సంస్థతో సమగ్ర విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. మూసీలో చెత్త తొలగింపు పేరుతోనే మొత్తం రూ. 21 వేల కోట్ల ప్రజాధనాన్ని ప్రభుత్వం ఖర్చు చేయబోతోందని ఏలేటి ఆరోపించారు. కాంగ్రెస్ ప్రభుత్వం సుమారు రూ. 92 వేల కోట్ల విలువైన పనుల్లో రూ. 82 వేల కోట్ల పనులను ఏపీకి చెందిన కాంట్రాక్టర్లకే అప్పగించిందని కూడా ఆరోపణలు గుప్పించారు. తెలంగాణ సంపదను 30 శాతం ఆస్థాన కాంట్రాక్టర్లే దోచుకుంటుంటే ప్రభుత్వం మౌనం ఎందుకు వహిస్తోందని నిలదీశారు. 'డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతోపాటు ట్రాన్స్కో, సింగరేణి సీఎండీకి అమెరికా టూర్ ఎందుకు? భట్టి టూర్పై చాలా అనుమానాలు ఉన్నాయి'అని ఏలేటి వ్యాఖ్యానించారు.

దొంగకు తాళం ఇస్తే ఎలా ఉంటుందో...

'కాంట్రాక్టరే.. మంత్రి అయితే ఎలా ఉంటుందో ఇప్పుడు స్పష్టమౌతోంది. దొంగకు తాళం ఇస్తే ఎలా ఉంటుందో రెవెన్యూ మంత్రి పొంగులేటి చేసి చూపిస్తున్నారు. 103 షెల్ కంపెనీల సంగతి ఏమిటి? మీ కంపెనీకి అన్ని ఆస్తులు ఎలా బదిలీ అయ్యాయి? రూ. లక్ష కోట్ల విలువైన భూములు మీ (పొంగులేటి)పై, మీ బినామీల పేర్లపై ఉన్న మాట వాస్తవం కాదా'అని ఏలేటి ప్రశ్నించారు.

బొండా ఉమా రౌడీలను పోగేసి దాడికి పాల్పడ్డారు: పేర్ని నాని

విజయవాడ సెంట్రల్ నియోజకవర్గంలో వైసీపీ చేపట్టిన నిరాహార దీక్షా శిబిరంపై టీడీపీ శ్రేణులు దాడి చేసి టెంట్ను తొలగించారంటూ మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమా అధికారమదంతో రౌడీలను పోగేసి ఈ దాడికి పాల్పడ్డారని ఆయన తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. రాష్ట్ర రాజకీయ చరిత్రలోనే అధికార పార్టీ జరుపుతున్న ఇటువంటి దాడులు ఒక మాయని మచ్చగా మిగిలిపోతాయని విమర్శించారు.బొండా ఉమా వంటి రౌడీలను ప్రోత్సహిస్తూ ముఖ్యమంత్రి చంద్రబాబు, మంత్రి నారా లోకేశ్ శునకానందం పొందుతున్నారని, అయితే ఈ ఆనందం ఎంతో కాలం నిలవదని పేర్ని నాని మండిపడ్డారు. శిశుపాలుడి పాపాలు పండినట్లే చంద్రబాబు ప్రభుత్వ పాపాలను కూడా ప్రజలు లెక్కిస్తున్నారని, కూటమి ప్రభుత్వానికి నూకలు చెల్లే రోజులు దగ్గరపడ్డాయని హెచ్చరించారు. "చంద్రబాబును ఏమైనా అంటే ఇళ్లకు వచ్చి కొడతామని బెదిరిస్తున్నారు. మీ చేతనైంది చేసుకోండి, ఎంతమందిని కొడతారో మేమూ చూస్తాం" అంటూ సవాల్ విసిరారు.

నిరసన తెలిపే యువత దేశ వ్యతిరేకులు కాదు

ఆందోళనలు, నిరసనలు చేపట్టినంత మాత్రాన యువతను (జెన్-జెడ్) దేశ వ్యతిరేకులుగా పరిగణించకూడదని రాష్ట్రీయ స్వయంసేవక్ సంఘ్ (ఆర్ఎస్ఎస్) సర్ సంఘచాలక్ మోహన్ భగవత్ అభిప్రాయపడ్డారు. వారు మన సంతతి అని, మన తర్వాతి తరమని పేర్కొన్న ఆయన, వారి ఆందోళనలను తప్పకుండా పరిష్కరించాలని స్పష్టం చేశారు. గురువారం ముంబైలో నిర్వహించిన ఒక యువజన సదస్సులో ఆయన ఈ కీలక వ్యాఖ్యలు చేశారు. "ప్రపంచ ఏకీకరణలో యువత పాత్ర - భారతీయ మార్గం" అనే అంశంపై జరిగిన ఈ సదస్సులో భగవత్ ప్రసంగిస్తూ, "ఒకవేళ జెన్-జెడ్ ఆందోళనలు చేస్తుంటే, వారు కచ్చితంగా దేశ వ్యతిరేకులు కాదు. వారు మనవారే. మన భావి తరానికి ప్రతినిధులు" అని పేర్కొన్నారు. ప్రజాస్వామ్యంలో తమ గళాన్ని వినిపించేందుకు అనేక మార్గాలు ఉన్నాయని, యువత నిరసనలు చేయవద్దని తాను చెప్పడం లేదని వివరించారు. నేటి యువత, ముఖ్యంగా జెన్-జెడ్, జెన్-ఆల్ఫా తరాల వారు ఎంతో నిజాయతీపరులని, వారిపై తనకు అపారమైన నమ్మకం ఉందని మోహన్ భగవత్ అన్నారు. ఇరుపక్షాలు ఒకరి అభిప్రాయాలను ఒకరు వినేలా అర్థవంతమైన చర్చలు జరగాలంటే

కరుణ, అవగాహన, పరస్పర గౌరవం అవసరమని నొక్కిచెప్పారు. యువత ఏదైనా విషయంపై గళంమెత్తుతోందంటే, అది వ్యతిరేకత కోసం కాదని, వ్యవస్థలో మెరుగుదల కోసమేనని భావించాలని సూచించారు. ఇటీవల నీట్ పరీక్షలో అక్రమాలు జరిగాయన్న ఆరోపణలతో విద్యార్థులు దేశవ్యాప్తంగా భారీ ఎత్తున నిరసనలు చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఆందోళనల నేపథ్యంలో దేశంలో నెలకొన్న పరిస్థితుల దృష్ట్యా మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి.

సైబర్ మాయగాళ్లతో జాగ్రత్త!

- ఓటీపీలు, బ్యాంక్ వివరాలు ఎవరికీ చెప్పవద్దు
- బాధితులైతే వెంటనే '1930'కు సమాచారం ఇవ్వాలి
- శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో సైబర్ అవగాహన సదస్సు

తొలివెలుగు, నాగోల్: ఆన్‌లైన్ నేరగాళ్ల మాయమాటలు నమ్మి మోసపోవద్దని, సైబర్ నేరాల పట్ల ప్రజలు, ముఖ్యంగా యువత నిరంతరం అప్రమత్తంగా ఉండాలని నాగోల్ సీఐ మహమ్మద్ మక్బూల్ జానీ తెలిపారు. 'సైబర్ జాగ్రూకత దివస్'ను పురస్కరించుకుని నాగోల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని శ్రేయాస్ ఇంజినీరింగ్ కళాశాలలో అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా సీఐ హాజరై మాట్లాడారు. బ్యాంక్ ఖాతా వివరాలు, ఓటీపీ, ఏటీఎం పిన్, సీవీవీ వంటి అత్యంత గోప్యమైన సమాచారాన్ని పరిచయం లేని వ్యక్తులతో ఎట్టి పరిస్థితుల్లోనూ పంచుకోవద్దని స్పష్టం చేశారు. సోషల్ మీడియా, ఆన్‌లైన్ షాపింగ్, తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలంటూ ఎర వేసే యాప్‌లు, పార్ట్‌టైమ్ ఉద్యోగాల ప్రకటనలతో పాటు ఇటీవల విస్తరిస్తున్న 'డిజిటల్ అరెస్ట్' పేరిట జరుగుతున్న మోసాల పట్ల జాగ్రత్తగా ఉండాలని హెచ్చరించారు. ఒకవేళ పొరపాటున సైబర్ మోసానికి గురైతే ఆలస్యం చేయకుండా వెంటనే '1930' జాతీయ సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్ నంబర్‌కు ఫోన్ చేయాలని లేదా ఎఎవతీఎతీఅఎవ.స్రశీఅ.అఅ వెబ్‌సైట్‌లో ఫిర్యాదు నమోదు చేయాలని సూచించారు. సకాలంలో స్పందిస్తే కోల్పోయిన సొత్తును రికవరీ చేసే అవకాశాలు ఎక్కువగా ఉంటాయని తెలిపారు. కళాశాల ప్రిన్సిపాల్ సి. ఉదయ్ కిరణ్, అధ్యాపకులు, పోలీసు సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్న ఈ కార్యక్రమంలో సైబర్ భద్రతపై పలు అంశాలను వివరించారు.

గంజాయి ముఠా గుట్టురట్టు

- రూ.1.12 లక్షల విలువైన మత్తు పదార్థం, కారు స్వాధీనం
- ఐదుగురు నిందితుల రిమాండ్
- వివరాలు వెల్లడించిన మరిపెడ సీఐ పవన్ కుమార్

తొలివెలుగు, మరిపెడ: ఒడిశా నుంచి నల్గొండ జిల్లాకు అక్రమంగా గంజాయి తరలిస్తున్న ఐదుగురు సభ్యుల ముఠాను మరిపెడ పోలీసులు పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ.1.12 లక్షల విలువైన 2 కిలోల 240 గ్రాముల ఎండు గంజాయి, ఒక మారుతీ సుజుకీ బాలేనో కారు, నాలుగు సెల్‌ఫోన్లు, రూ.1,500 నగదును స్వాధీనం చేసుకున్నట్లు మరిపెడ సీఐ ఎల్. పవన్ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. ఎస్ఐ గండ్రాతి సతీష్, సిబ్బంది రవీందర్, రమేష్, వెంకన్న, మహిళా కానిస్టేబుల్ శాంతలతో కలిసి పురుషోత్తమాయగూడెం వంతెన వద్ద వాహనాల తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో వేగంగా వస్తున్న బాలేనో కారును ఆపేందుకు యత్నించగా డ్రైవర్ తప్పించుకునేందుకు వేగం పెంచాడు. అప్రమత్తమైన పోలీసులు వాహనాన్ని నిలిపి తనిఖీ చేయగా డ్రైవర్ సీటు కింద గంజాయి ప్యాకెట్ లభించింది. కారులోని గండికోట వంశీ (24), చిత్రం రాకేష్ (22), చింతల తిరుమలేష్ (24), కంచి మహేష్ (25), మాదాసు మహేష్ (26)లను అదుపులోకి తీసుకుని విచారించారు. త్వరగా డబ్బు సంపాదించాలనే ఉద్దేశంతో నల్గొండలో సెల్ఫ్ డ్రైవ్‌కు కారును అద్దెకు తీసుకుని ఒడిశా వెళ్లి గంజాయి కొనుగోలు చేసినట్లు నిందితులు ఒప్పుకున్నారు. కేసు నమోదు చేసి ఐదుగురినీ రిమాండ్‌కు తరలించినట్లు సీఐ వివరించారు.

ప్రొఫెసర్ జయశంకర్ 92వ జయంతి వేడుకలు

- శాఖ గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి
- ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- పాల్గొన్న గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

తొలివెలుగు, రామన్నపేట: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన విశిష్ట సేవలు, ఉద్యమానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి కట్కూరి నరసింహ, పాఠకులు మోటే నరసింహ తదితరులు పాల్గొన్నారు.

యాదాద్రీశుడి సేవలో సినీ నటుడు శ్రీకాంత్

- స్వయంభూ లక్ష్మీనరసింహస్వామివారికి ప్రత్యేక పూజలు
- వేద పండితుల మంత్రోచ్చారణలు, ఆశీర్వచనం
- తీర్థప్రసాదాలు, స్వామివారి చిత్రపటాన్ని బహూకరించిన ఈవో భవానీ శంకర్

తొలివెలుగు, యాదగిరిగుట్ట: ప్రముఖ పుణ్యక్షేత్రం యాదగిరిగుట్ట శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని ప్రముఖ సినీ నటుడు శ్రీకాంత్ గురువారం దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు దేవస్థాన అధికారులు, అర్చక బృందం సంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. అనంతరం ప్రధాన ఆలయంలో వేంచేసి ఉన్న స్వయంభూ శ్రీ లక్ష్మీనరసింహ స్వామివారిని శ్రీకాంత్ దర్శించుకుని, స్వామివారికి ప్రత్యేక పూజలు, అర్చనలు నిర్వహించి మొక్కులు చెల్లించుకున్నారు. దర్శనానంతరం ముఖమండపంలో శ్రీకాంత్‌కు వేద పండితులు మంత్రోచ్చారణల నడుమ వేద ఆశీర్వచనం అందజేశారు. ఆలయ కార్యనిర్వహణాధికారి (ఈవో) భవానీ శంకర్ (ఐఏఎస్) ఆయనకు స్వామివారి శేషవస్త్రంతో పాటు జ్ఞాపికగా సుందర చిత్రపటాన్ని, ప్రసిద్ధ లడ్డూ ప్రసాదాలను బహూకరించారు. ఈ సందర్భంగా నటుడు శ్రీకాంత్ మాట్లాడుతూ.. యాదాద్రీశుడిని దర్శించుకోవడం మహాద్భాగ్యంగా భావిస్తున్నానని, క్షేత్రంలో ఆధ్యాత్మిక వాతావరణం, పునర్నిర్మిత ఆలయ సౌందర్యం మనస్సుకు ఎంతో ప్రశాంతతను అందించాయని సంతోషం వ్యక్తం చేశారు. శ్రీకాంత్ రాక విషయం తెలుసుకున్న పలువురు భక్తులు, స్థానికులు ఆయనను చూసేందుకు ఆసక్తి కనబరిచారు.

ఆగస్టు 10న 'జైల్ భరో'ను జయప్రదం చేయాలి

- వలిగొండ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ
- కేంద్ర ప్రభుత్వ విధానాలకు నిరసనగా కలెక్టరేట్ల వద్ద మహాధర్నా
- కార్మిక, రైతు, వ్యవసాయ సంఘాల నాయకుల పిలుపు

తొలివెలుగు, వలిగొండ: కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ ఆగస్టు 10వ తేదీన కేంద్ర కార్మిక, రైతు, వ్యవసాయ కార్మిక సంఘాల ఆధ్వర్యంలో నిర్వహించనున్న 'జైల్ భరో' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని కోరుతూ గురువారం వలిగొండ మండల కేంద్రంలో బైక్ ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు సిర్పంగి స్వామి, సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి తుర్కపల్లి సురేందర్, రైతు సంఘం జిల్లా సహాయ కార్యదర్శి కందడి సత్తిరెడ్డి మాట్లాడుతూ.. కేంద్రంలోని భాజపా ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలపై నిరసనగా ఆగస్టు 10న జిల్లా కలెక్టరేట్ కార్యాలయాల ఎదుట మహాధర్నా, జైల్ భరో చేపడుతున్నట్లు తెలిపారు. స్వాతంత్ర్యానికి పూర్వం పోరాడి సాధించుకున్న కార్మిక చట్టాలను రద్దు చేస్తూ కొత్తగా లేబర్ కోడ్‌లను తీసుకురావడం దారుణమన్నారు. రైతులకు గిట్టుబాటు ధర కల్పించేందుకు స్వామినాథన్ కమిషన్ సిఫార్సుల ప్రకారం కనీస మద్దతు ధర అమలు చేయాలని, జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేస్తూ నూతనంగా తెచ్చిన వి.బి.జి. గ్రామ్ జి పథకాన్ని వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం మండల అధ్యక్షుడు కొండె కిష్టయ్య, జిల్లా కమిటీ సభ్యుడు దొడ్డి భిక్షపతి, మండల ఉపాధ్యక్షులు కల్కూరి ముత్యాలు, భీమనబోయిన జంగయ్య, సీఐటీయూ జిల్లా కమిటీ సభ్యులు రాదారపు మల్లేశం, కొండె నరసింహ, రైతు సంఘం మండల ఉపాధ్యక్షులు మంగ బాలయ్య, కందకట్ల సాయిరెడ్డి, హమాలీ సంఘం జిల్లా అధ్యక్షుడు జన్ని జంగయ్య, భవన నిర్మాణ కార్మిక సంఘం మండల కార్యదర్శి మొగిలిపాక ఎల్ల స్వామి, గ్రామ పంచాయతీ కార్మికుల సంఘం మండల కార్యదర్శి ఉక్కుర్తి రాములు, కేవీపీఎస్ మండల అధ్యక్షుడు వేముల అమరేందర్, నాయకులు చేగూరి నగేష్, కొండూరు సత్తయ్య, పోలేపాక శంకర్, మల్ల బీరప్ప, మద్దెల శంకరయ్య, కొమ్మిడి సత్తిరెడ్డి, బొడ్డు రాములు, గంగపురం వెంకటేశం, మల్ల కుమార్, పోలేపల్లి స్వామి తదితరులు పాల్గొన్నారు.

వివాహిత అదృశ్యం.. కేసు నమోదు

- పుట్టింటికి వెళ్తానని చెప్పి బయలుదేరిన మహిళ
- భువనగిరి చేరుకున్నాక ఫోన్ స్విచ్ ఆఫ్
- రాజాపేట పోలీసుల దర్యాప్తు

తొలివెలుగు, రాజాపేట: పుట్టింటికి వెళ్తానని చెప్పి బయలుదేరిన వివాహిత అదృశ్యమైన ఘటనపై రాజాపేట పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. పోలీసుల వివరాల ప్రకారం.. సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణంలోని బీడీ కాలనీకి చెందిన కుచ్చన్ హరి తన చెల్లెలు వీరబత్తిని సరస్వతి (28) అదృశ్యమైనట్లు ఫిర్యాదు చేశారు. సరస్వతికి ఐదేళ్ల క్రితం రాజాపేట మండలం రఘునాథపురం గ్రామానికి చెందిన వీరబత్తిని మణికాంత్‌తో వివాహమైంది. వీరికి నాలుగేళ్ల కుమారుడు ఉన్నాడు. ఈ నెల 4న మధ్యాహ్నం గజ్వేల్‌లోని తల్లి ఇంటికి వెళ్లేందుకు రఘునాథపురం నుంచి ఆటోలో భువనగిరికి బయలుదేరింది. మధ్యాహ్నం 2:30 గంటల సమయంలో భువనగిరి చేరుకున్నానని, గజ్వేల్ బస్సు ఎక్కుతానని సోదరుడు హరికి ఫోన్ చేసి చెప్పింది. పది నిమిషాల తర్వాత తిరిగి ఫోన్ చేయగా ఆమె మొబైల్ స్విచ్ ఆఫ్ అయింది. ఎంతకీ ఆచూకీ లభించకపోవడంతో బాధితుడు గజ్వేల్ పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అక్కడ జీరో ఎఫ్ఐఆర్ నమోదు చేసి, తదుపరి చర్యల కోసం భువనగిరి టౌన్ పోలీస్ స్టేషన్‌కు, అక్కడి నుంచి రాజాపేట పోలీస్ స్టేషన్‌కు కేసును బదిలీ చేశారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

సాగునీటి కాలువల్లో 'గుర్రపు డెక్క'ను తొలగించాలి

- వెల్వర్తి వెళ్లే కాలువలను పరిశీలించిన భాజపా నాయకులు
- రైతులకు సాగునీరందక ఇబ్బందులు
- చర్యలు తీసుకోకపోతే ధర్నాకు దిగుతామని హెచ్చరిక

తొలివెలుగు, వలిగొండ: వలిగొండ చెరువు నుంచి వెల్వర్తి తదితర గ్రామాలకు వెళ్లే సాగునీటి కాలువల్లో పేరుకుపోయిన గుర్రపు డెక్కను వెంటనే తొలగించాలని భాజపా మండల అధ్యక్షుడు బోళ్ల సుదర్శన్ డిమాండ్ చేశారు. గురువారం భాజపా నాయకులతో కలిసి ఆయన సాగునీటి కాలువలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాలువల్లో గుర్రపు డెక్క తీవ్రంగా పేర్కొపోవడంతో నీటి ప్రవాహం నిలిచిపోయి రైతులు సాగునీరందక తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంబంధిత అధికారులు తక్షణమే స్పందించి గుర్రపు డెక్కను తొలగించి, నీటి ప్రవాహాన్ని పునరుద్ధరించాలని కోరారు. లేనిపక్షంలో రైతులతో కలిసి కాలువల వద్దే భాజపా ఆధ్వర్యంలో ధర్నా చేపడతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో భాజపా జిల్లా కార్యవర్గ సభ్యుడు మైసోల్ల రామనర్స్, జిల్లా నాయకులు మైసోల్ల మచ్చగిరి, బచ్చు శ్రీనివాస్, ఆనంద్, మండల పదాధికారులు నాగరాజు, దయాకర్, వెంకటేశం, నాయకులు పెద్ద కిట్టు, పాతకోట నరేష్, ఎల్లంకి మురళి, జంగయ్య తదితరులు పాల్గొన్నారు.

పోచంపల్లికి మెగా క్లస్టర్ మంజూరు చేయాలి

- కేంద్ర జవుళి శాఖ డీసీ బీనాకు వినతిపత్రం అందజేత
- రూ.38 లక్షల కార్పస్ ఫండ్ నిధులు విడుదల చేయాలని విజ్ఞప్తి
- పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: పోచంపల్లి చేనేత పరిశ్రమ అభివృద్ధికి మెగా క్లస్టర్‌ను మంజూరు చేయాలని పోచంపల్లి చేనేత సహకార సంఘం అధ్యక్షుడు భారత లవకుమార్ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. గురువారం న్యూఢిల్లీలోని డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ ఇంటర్నేషనల్ సెంటర్‌లో నిర్వహించిన 'జీఐ అండ్ బియాండ్ 2.0' సమిట్‌లో కేంద్ర చేనేత, జవుళి శాఖ డీసీ బీనాను ఆయన కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా లవకుమార్ మాట్లాడుతూ.. కేంద్ర ప్రభుత్వం నుంచి పోచంపల్లికి రావాల్సిన రూ.38 లక్షల కార్పస్ ఫండ్ నిధులు పెండింగ్‌లో ఉన్నాయని, వాటిని వెంటనే విడుదల చేయాలని కోరారు. సంక్షోభంలో ఉన్న చేనేత రంగాన్ని ఆదుకోవడానికి, చేనేత కళాకారుల సంక్షేమానికి కేంద్రం తగిన సహాయం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో వీవర్స్ సర్వీస్ సెంటర్ డైరెక్టర్ అరుణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

బీసీ వసతి గృహాన్ని పరిశీలించిన ఎంపీడీవో

- విద్యార్థినులతో కలిసి భోజనం.. నోట్‌బుక్స్ పంపిణీ
- ఆహార నాణ్యతలో నిర్లక్ష్యం వహించవద్దు
- మండల అభివృద్ధి అధికారి ఏ. రాములు

తొలివెలుగు, రామన్నపేట: మండల కేంద్రంలోని బీసీ బాలికల వసతి గృహాన్ని మండల అభివృద్ధి అధికారి (ఎంపీడీవో) ఏ. రాములు గురువారం ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా వసతి గృహంలో విద్యార్థినులకు కల్పిస్తున్న సౌకర్యాలు, పరిసరాల పరిశుభ్రత, భోజన నాణ్యతను క్షుణ్ణంగా పరిశీలించారు. అనంతరం విద్యార్థినులతో కలిసి భోజనం చేసి, వారికి అందిస్తున్న ఆహారం రుచి, నాణ్యతపై ఆరా తీశారు. విద్యార్థినులతో ఆప్యాయంగా మాట్లాడి వారి చదువు, ఎదుర్కొంటున్న సమస్యల గురించి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న వసతులను సద్వినియోగం చేసుకుంటూ చదువులో ప్రతిభ కనబరిచి ఉన్నత లక్ష్యాలను సాధించాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా విద్యార్థినులకు నోట్‌బుక్స్ పంపిణీ చేశారు. వసతి గృహంలో పరిశుభ్రత పాటించాలని, ఆహార నాణ్యత విషయంలో ఎటువంటి నిర్లక్ష్యం తగదని సిబ్బందిని ఆదేశించారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి వార్డెన్ స్వప్న, వసతి గృహ సిబ్బంది పాల్గొన్నారు.

నూతన సీఐకి ఘన సత్కారం

- శుభాకాంక్షలు తెలిపిన టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరి
- ప్రజలకు నాణ్యమైన పోలీసు సేవలు అందించాలని ఆకాంక్ష
- శాంతిభద్రతల పరిరక్షణలో ముందుండాలి: గడ్డం యాదగిరి

తొలివెలుగు, రామన్నపేట: రామన్నపేట పోలీస్ స్టేషన్‌కు నూతన సర్కిల్ ఇన్‌స్పెక్టర్ (సీఐ)గా బాధ్యతలు స్వీకరించిన మోలుగురి రవిని గురువారం టీపీసీసీ ఎస్సీ సెల్ రాష్ట్ర కార్యదర్శి గడ్డం యాదగిరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, నాయకులు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా గడ్డం యాదగిరి మాట్లాడుతూ.. ప్రజలకు సత్వర, పారదర్శక, నాణ్యమైన పోలీసు సేవలు అందిస్తూ శాంతిభద్రతల పరిరక్షణలో సీఐ రవి సమర్థవంతంగా విధులు నిర్వహించాలని ఆకాంక్షించారు. ప్రజల సమస్యలను సానుకూల దృక్పథంతో పరిష్కరిస్తూ పోలీస్ శాఖపై మరింత విశ్వాసాన్ని పెంపొందించాలని కోరారు. అనంతరం నూతన సీఐ రవికి పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఇస్నిళ్ల గ్రామ ఉపసర్పంచ్ బందెల నాగేష్, వల్లమల్ల యాదయ్య, నరసింహ, గడ్డం మచ్చగిరి తదితరులు పాల్గొన్నారు.

రైతు ఆకస్మిక మృతి.. కుటుంబంలో తీరని శోకం

- శాఖ గ్రంథాలయంలో చిత్రపటానికి పూలమాల వేసి నివాళి
- ఆయన ఆశయాలను యువత ఆదర్శంగా తీసుకోవాలి
- పాల్గొన్న గ్రంథాలయ సిబ్బంది, పాఠకులు

తొలివెలుగు, రామన్నపేట: తెలంగాణ సిద్ధాంతకర్త, ప్రముఖ విద్యావేత్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను గురువారం మండల కేంద్రంలోని శాఖ గ్రంథాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. అనంతరం వక్తలు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమంలో ప్రొఫెసర్ జయశంకర్ అందించిన విశిష్ట సేవలు, ఉద్యమానికి చేసిన కృషిని స్మరించుకున్నారు. యువత ఆయన ఆశయాలను ఆదర్శంగా తీసుకుని ముందుకు సాగాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ ఇన్‌చార్జి కట్కూరి నరసింహ, పాఠకులు మోటే నరసింహ తదితరులు పాల్గొన్నారు.

టిప్పర్స్ ఓనర్స్ యూనియన్ అధ్యక్షుడిగా బాలరాజు

- పిలాయిపల్లి రంగనాయక స్వామి ఆలయ ఆవరణలో సమావేశం
- నూతన కార్యవర్గం ఏకగ్రీవ ఎన్నిక

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: మండల పరిధిలోని పిలాయిపల్లి గ్రామంలో ఉన్న శ్రీశ్రీశ్రీ రంగనాయక స్వామి దేవాలయ ఆవరణలో గురువారం 'శ్రీశ్రీశ్రీ రంగనాయక స్వామి టిప్పర్ ఓనర్స్ యూనియన్ అసోసియేషన్' సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నూతన కార్యవర్గాన్ని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. సంఘం అధ్యక్షుడిగా లింగాల బాలరాజు, గౌరవ అధ్యక్షుడిగా బందెల సంజీవ, ఉపాధ్యక్షుడిగా నర్ర జంగయ్య, ప్రధాన కార్యదర్శిగా దోసపాటి రాజు, కోశాధికారిగా కొంతం అనిల్ ఎన్నికయ్యారు. ఈ సందర్భంగా నూతన కార్యవర్గ ప్రతినిధులు మాట్లాడుతూ.. టిప్పర్ యజమానుల సంక్షేమానికి, ఎదురవుతున్న సమస్యల పరిష్కారానికి ఐక్యంగా కృషి చేస్తామని తెలిపారు.

జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

- రాజాపేట మండలంలో ఘనంగా జయంతి వేడుకలు
- పూలమాలలు వేసి నివాళి
- హాజరైన అధికారులు, ప్రజాప్రతినిధులు

+తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండల పరిధిలోని పలు ప్రభుత్వ, ప్రజా కార్యాలయాల్లో తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ జయశంకర్ జయంతి వేడుకలను గురువారం ఘనంగా నిర్వహించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు రేణికుంట పి.ఎ.సి.ఎస్. కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్లు, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు. తహసిల్దార్ కార్యాలయం వద్ద రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ (ఆర్ఐ) పల్లెపాటి నర్సింహులు జయశంకర్ చిత్రపటానికి పూలమాల వేసి అంజలి ఘటించారు. కార్యక్రమంలో జూనియర్ అసిస్టెంట్లు ఆనంద్, ఉపేంద్ర, రికార్డు అసిస్టెంట్లు లక్ష్మి, సరస్వతి, రవి, శ్రీను, జీపీఓలు కవిత, ఉపేంద్ర, శీనయ్య, సుదర్శన్, మహాలక్ష్మి, ఓఎస్ స్వామి తదితరులు పాల్గొన్నారు. మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో కూతల నాగవేణి ఆధ్వర్యంలో జయంతి వేడుకలు జరగగా, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

పశువుల అక్రమ రవాణా ముఠా గట్టురట్టు

- చౌటుప్పల్‌లో 29 పశువుల స్వాధీనం
- అక్రమ రవాణాపై పోలీసుల ఉక్కుపాదం.. నలుగురిపై కేసు నమోదు
- తుని పశువుల సంత నుంచి హైదరాబాద్‌కు తరలింపు యత్నం భగ్నం
- అనుమతులు లేకుండా రవాణా.. ప్రాణుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం కింద చర్యలు
- జాతీయ రహదారులపై నిఘా మరింత కట్టుదిట్టం: సీఐ జి. మన్మథ కుమార్



తొలివెలుగు, చౌటుప్పల్: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం నుంచి హైదరాబాద్‌కు అక్రమంగా పశువులను తరలిస్తున్న వాహనాన్ని చౌటుప్పల్ పోలీసులు పట్టుకుని 29 పశువులను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలో కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాలకు చెందిన నలుగురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించినట్లు చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ తెలిపారు. పోలీసుల కథనం ప్రకారం.. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ ఎస్‌హెచ్ఓ ఆదేశాల మేరకు బుధవారం (ఆగస్టు 5) పోలీసు సిబ్బంది ఉదయ్, శ్రీహరి బీసీ-1 పరిధిలో వాహన తనిఖీలు నిర్వహిస్తుండగా పశువుల అక్రమ రవాణాపై విశ్వసనీయ సమాచారం అందింది. వెంటనే పోలీసులు చౌటుప్పల్ మండలంలోని లక్కారం వంతెన వద్ద ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అనుమానాస్పదంగా వస్తున్న లిఐషర్ వాహనం (నంబర్: కేఏ 35 డీ 3468)లిను ఆపి తనిఖీ చేయగా, ఎలాంటి అనుమతులు లేకుండా అత్యంత ఇరుకుగా, ప్రాణుల సంక్షేమ నిబంధనలకు విరుద్ధంగా తరలిస్తున్న 29 పశువులు లభ్యమయ్యాయి. వీటిలో 8 ఆవులు, 21 ఎద్దులు ఉన్నట్లు పోలీసులు గుర్తించారు.

తుని సంతలో కొనుగోలు.. హైదరాబాద్‌కు తరలింపు:

వాహనంలోని వ్యక్తులను అదుపులోకి తీసుకుని విచారించగా, ఈ పశువులను ఆంధ్రప్రదేశ్‌లోని తుని పశువుల సంతలో కొనుగోలు చేసి హైదరాబాద్‌లో విక్రయించేందుకు తరలిస్తున్నట్లు అంగీకరించినట్లు పోలీసులు తెలిపారు.

నలుగురిపై కేసు నమోదు:

ఈ కేసులో కర్ణాటకకు చెందిన రోడూరు అలియాస్ ఆర్. బాబు (33), బి. మారుతి (20), ఆంధ్రప్రదేశ్‌కు చెందిన సీరం శ్రీను (48), ఆది నారాయణలపై అనుమతులు లేకుండా పశువులను రవాణా చేయడం, అలాగే ప్రాణుల పట్ల క్రూరత్వ నిరోధక చట్టం నిబంధనలను ఉల్లంఘించినందుకు కేసు నమోదు చేసినట్లు పోలీసులు వెల్లడించారు.

అక్రమ రవాణాపై కఠిన చర్యలు:

పశువుల అక్రమ రవాణాపై జాతీయ రహదారులపై నిరంతరం నిఘా కొనసాగుతోందని, చట్టవిరుద్ధంగా పశువులను తరలించే వారిపై కఠిన చర్యలు తప్పవని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్ హెచ్చరించారు. పశువుల సంక్షేమానికి విఘాతం కలిగించే చర్యలను ఏమాత్రం ఉపేక్షించబోమని స్పష్టం చేశారు.

జయశంకర్ ఆశయాలను కొనసాగించాలి

- చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళి
- భూదాన్ పోచంపల్లిలో ఘనంగా జయంతి వేడుకలు

తొలివెలుగు, భూదాన్ పోచంపల్లి: పురపాలక కేంద్రంలో తెలంగాణ ఉద్యమకారుల సంఘం ఆధ్వర్యంలో గురువారం తెలంగాణ సిద్ధాంతకర్త ప్రొఫెసర్ కొత్తపల్లి జయశంకర్ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సంఘం నాయకులు ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ప్రొఫెసర్ జయశంకర్ తన జీవితాన్ని త్యాగం చేశారని కొనియాడారు. తెలంగాణ అభివృద్ధి, ఆయన కన్న కలలను సాకారం చేసేలా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఉద్యమకారుల సంఘం నాయకులు సింగబోయిన సత్యనారాయణ, పో నమోని శ్రీశైలం, బైరు రామాంజనేయులు, మెరుగు శశికళ, కూరపాటి బాబు, నామిని భాస్కర్ తదితరులు పాల్గొన్నారు

పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడిగా మహేష్

- ఏకగ్రీవంగా ఎన్నుకున్న కార్యవర్గం
- పార్టీ బలోపేతానికి కృషి చేస్తా: మహేష్
- పూర్వ అధ్యక్షుడు ఐరేని నవీన్ కుమార్‌కు ఘన సన్మానం

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడిగా పిండికూర మహేష్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. గురువారం స్థానిక ప్రభుత్వ అతిథి గృహంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు, పిఎసిఎస్ చైర్మన్ నమిల మహేందర్ గౌడ్ సమక్షంలో పట్టణ శాఖ నూతన కార్యవర్గ ఎన్నికల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా పట్టణ అధ్యక్షుడిగా మహేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ప్రకటించారు. అనంతరం నూతన అధ్యక్షుడు పిండికూర మహేష్ మాట్లాడుతూ.. తనపై నమ్మకంతో బాధ్యతలు అప్పగించిన నాయకులకు, కార్యకర్తలకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. పార్టీ అభివృద్ధి కోసం నిరంతరం శ్రమిస్తూనే, ప్రభుత్వ సంక్షేమ పథకాలన్నీ అర్హులైన వారందరికీ అందేలా చూస్తానని స్పష్టం చేశారు. అనంతరం మహేష్‌ను పలువురు నాయకులు శాలువాలతో సత్కరించి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు పట్టణ అధ్యక్షుడిగా సేవలుందించిన ఐరేని నవీన్ కుమార్ కృషిని కొనియాడి, ఆయనను కూడా ఘనంగా సన్మానించారు.

సెయింట్ జెకర్యాస్ స్కూల్లో విద్యార్థి మండలి ఎన్నికలు

- ప్రజాస్వామ్య పద్ధతిలో ఓటేసిన విద్యార్థులు
- నాయకత్వ లక్షణాల పెంపొందింపే లక్ష్యం
- విజేతలను అభినందించిన యాజమాన్యం

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం జాల గ్రామంలోని సెయింట్ జెకర్యాస్ ఇంగ్లీష్ మీడియం ఉన్నత పాఠశాలలో గురువారం విద్యార్థి మండలి (స్టూడెంట్ కౌన్సిల్) ఎన్నికలు ప్రశాంత వాతావరణంలో జరిగాయి. బిషప్ జాన్ గొల్లపల్లి, డైరెక్టర్ తిమోతి జాన్ గొల్లపల్లిల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ ఎన్నికల్లో విద్యార్థులు ప్రజాస్వామ్యయుతంగా, క్రమశిక్షణతో ఓటు హక్కు వినియోగించుకున్నారు. పాఠశాల ఇన్‌చార్జ్ మన్నే వినయ్ కుమార్, ఉపాధ్యాయులు, ఎన్నికల కమిటీ పర్యవేక్షణలో పోలింగ్ ప్రక్రియ సాగింది. స్కూల్ కెప్టెన్, వైస్-కెప్టెన్, స్పోర్ట్స్ కెప్టెన్, కల్చరల్ సెక్రటరీ, హౌస్ కెప్టెన్ పదవులకు ప్రతినిధులను ఎన్నుకోవడానికి విద్యార్థులు ఉత్సాహంగా ఓట్లు వేశారు. అనంతరం ఫలితాలను వెల్లడించారు. విజేతలను ప్రిన్సిపాల్ అభినందిస్తూ.. నాయకత్వం అంటే సేవ, నిజాయితీ, జట్టు కృషి అని పేర్కొన్నారు. విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు, బాధ్యతను పెంపొందించడానికే ఈ కార్యక్రమం చేపట్టినట్లు యాజమాన్యం తెలిపింది.

బాధిత కుటుంబానికి ‘యువసేన’ చేయూత

- రూ.5 వేల ఆర్థిక సాయం అందజేత
- బేగంపేటలో పోచమ్మ కుటుంబానికి పరామర్శ

తొలివెలుగు, రాజాపేట: రాజాపేట మండలం బేగంపేట గ్రామానికి చెందిన చింతకింది పోచమ్మ ఇటీవల మృతిచెందడంతో ఆమె కుటుంబానికి జెల్ల పరమేష్ యువసేన సభ్యులు గురువారం ఆర్థిక సాయం అందించారు. మృతురాలి కుటుంబ సభ్యులను పరామర్శించి రూ.5,000 నగదును అందజేశారు. కష్టకాలంలో ఉన్న పేద కుటుంబాన్ని ఆదుకునేందుకు తమవంతుగా ఈ సాయం అందించినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో యువసేన అధ్యక్షుడు జెల్ల పరమేష్, సభ్యులు కరుణాకర్, బాలస్వామి, ప్రసాద్, నాగరాజు, కమలాకర్, నగేష్, బాలు తదితరులు పాల్గొన్నారు.

యూత్ కాంగ్రెస్ నూతన కమిటీ ఎన్నిక

- ఆరూరులో నిర్వహించిన సమావేశం
- అధ్యక్షుడిగా ఎర్ర సాయి గౌడ్ ఎంపిక
- హాజరైన పార్టీ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి

తొలివెలుగు, వలిగొండ: వలిగొండ మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో గురువారం నూతన యూత్ కాంగ్రెస్ గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకుడు వాకిటి అనంతరెడ్డి ఆధ్వర్యంలో ఈ ఎన్నిక నిర్వహించారు. యూత్ కాంగ్రెస్ గ్రామ అధ్యక్షుడిగా ఎర్ర సాయి గౌడ్, ఉపాధ్యక్షులుగా పాక మహేష్ యాదవ్, జీనుకల మచ్చగిరి యాదవ్, వర్కింగ్ ప్రెసిడెంట్‌గా ఎర్ర మణిరాజ్ గౌడ్, జనరల్ సెక్రటరీగా కొప్పుల మధు గౌడ్ ఎంపికయ్యారు. అలాగే జాయింట్ సెక్రటరీగా బుర్ర శివ యాదవ్, సోషల్ మీడియా కన్వీనర్‌గా బుర్ర శ్రీకర్ యాదవ్, కోశాధికారులుగా చాడ రవి, వెంపటి శరత్‌లతో పాటు పలువురు కార్యవర్గ సభ్యులుగా ఎన్నికయ్యారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ గ్రామశాఖ అధ్యక్షుడు బుర్ర నరసింహ, ఉపాధ్యక్షుడు బండారి మహిపాల్ రెడ్డి, గ్రామ ఉపసర్పంచ్ గొడ్డేటి సత్యం యాదవ్, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షుడు ఆవుల స్వామి, మత్స్యగిరి గుట్ట ధర్మకర్త దామెర అనంత చారి, వార్డు సభ్యులు రేఖ మచ్చగిరి, వేముల అనిల్, పార్టీ కార్యకర్తలు, యూత్ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

ఏదవీ విరమణ చేసినా.. బడిపై వీడని మమకారం

- జయశంకర్ జయంతి వేళ విద్యార్థులకు ‘క్రీడా’ దుస్తుల విరాళం
- రూ.50 వేల సొంత నిధులు వెచ్చించిన మాజీ హెచ్ఎం కూరెళ్ల శ్రీనివాస్ దంపతులు
- పూర్వ హెచ్ఎంను కొనియాడిన పాఠశాల బృందం

తొలివెలుగు, చౌటుప్పల్: ప్రొఫెసర్ జయశంకర్ జయంతిని పురస్కరించుకుని విద్యార్థుల్లో క్రీడాస్ఫూర్తిని నింపేందుకు లింగోజిగూడెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల మాజీ గెజిటెడ్ ప్రధానోపాధ్యాయులు కూరెళ్ల శ్రీనివాస్-శైలజ దంపతులు రూ.50 వేల విలువైన స్పోర్ట్స్ యూనిఫాంలను గురువారం అందజేశారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు కోమటిరెడ్డి మాధవరెడ్డి అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో విద్యార్థులకు వీటిని పంపిణీ చేశారు. ఈ సందర్భంగా హెచ్ఎం మాధవరెడ్డి మాట్లాడుతూ.. ఉద్యోగ విరమణ పొందినప్పటికీ పాఠశాల అభ్యున్నతిని మరువకుండా విద్యార్థుల సంక్షేమానికి సహకరిస్తున్న కూరెళ్ల శ్రీనివాస్ సేవలు ప్రతి ఉపాధ్యాయుడికి ఆదర్శనీయమని కొనియాడారు. స్కూల్ కాంప్లెక్స్ పంతంగి హెచ్ఎం సత్యనారాయణ మాట్లాడుతూ.. బడితో అనుబంధాన్ని కొనసాగిస్తూ దాతృత్వం చాటుకోవడం అభినందనీయమన్నారు. అనంతరం శ్రీనివాస్‌ను ఉపాధ్యాయ బృందం ఘనంగా సన్మానించింది. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు అరుణ, పురుషోత్తమ చారి, విజయలక్ష్మి, రమేష్ రెడ్డి, బండి అనిల్ కుమార్ రెడ్డి, దేవేందర్, రూప, విద్యార్థులు పాల్గొన్నారు.

ఘనంగా జయశంకర్ జయంతి వేడుకలు

- తెలంగాణ ఉద్యమానికి జయశంకర్ సార్ సేవలు చిరస్మరణీయం: కోయ్యడ శేఖర్ గౌడ్

తొలివెలుగు, చౌటుప్పల్: తెలంగాణ సిద్ధాంతకర్త ఆచార్య కొత్తపల్లి జయశంకర్ 92వ జయంతి వేడుకలను చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధిలోని తంగడపల్లి గ్రామంలో గురువారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జయశంకర్ కాంస్య విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు ఘన నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో బీఆర్ఎస్ మున్సిపల్ ఫ్లోర్ లీడర్ కోయ్యడ శేఖర్ గౌడ్ మాట్లాడుతూ.. ప్రత్యేక తెలంగాణ రాష్ట్ర సాధన ఉద్యమానికి ఆచార్య జయశంకర్ అందించిన సేవలు, సైద్ధాంతిక మార్గదర్శకత్వం చిరస్మరణీయమని కొనియాడారు. తెలంగాణ ఉద్యమానికి ఆయన చూపిన దిశానిర్దేశం భావితరాలకు స్ఫూర్తిగా నిలుస్తుందని పేర్కొన్నారు. ఆయన ఆశయాలను ప్రతి ఒక్కరూ ఆచరణలో పెట్టి సమాజాభివృద్ధికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్లు ఊదరి యాదయ్య, గడ్డం ఇందిరా రాజరత్నం, మాజీ సర్పంచ్ ముటుకుల్లోజు దయాకర్ చారి, నాయకులు బొప్పిడి రఘునందన్ రెడ్డి, రాగీరు సత్యనారాయణ, నిమ్మల అచ్చయ్య, బొడ్డు ముత్యం గౌడ్, బొంగు స్వామి, జిట్ట కృష్ణ, ఎండి అస్లాం తదితరులు పాల్గొన్నారు.

శంబులింగేశ్వర ఆలయానికి మైక్ సెట్ విరాళం

- అందజేసిన హైదరాబాద్ దాత చెప్యాల భాస్కర్
- అభినందించిన సర్పంచ్ అనురాధ రమేష్

తొలివెలుగు, దౌల్తాబాద్: దౌల్తాబాద్ మండల కేంద్రంలోని శ్రీ శంబులింగేశ్వర స్వామి ఆలయానికి హైదరాబాద్‌కు చెందిన దాత చెప్యాల భాస్కర్ గురువారం మైక్ సెట్‌ను విరాళంగా అందజేశారు. ఆలయంలో నిర్వహించిన కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ సమక్షంలో ఈ ఉపకరణాన్ని ఆలయ వర్గాలకు సమర్పించారు. ఈ సందర్భంగా దాత భాస్కర్ మాట్లాడుతూ.. ఆధ్యాత్మిక కేంద్రాలైన దేవాలయాల అభివృద్ధికి ప్రతీ భక్తుడు తనవంతుగా తోడ్పాటు అందించాలని కోరారు. గుడులలో మౌలిక వసతుల కల్పనకు దాతలు ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు. గ్రామ సర్పంచ్ ముచ్చమర్రి అనురాధ రమేష్ మాట్లాడుతూ.. ఆలయ అవసరాలకు సరిపడా మైక్ సెట్‌ను ఉదారంగా అందజేసిన భాస్కర్‌ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ అర్చకులు ఆంజనేయులు, స్థానికులు ఆది మహేష్, బుద్దరాజు, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

బిడ్డ ఎదుగుదలకు ‘ముర్రుపాలే’ శ్రీరామరక్ష

- తిరుమలాపూర్‌లో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు
- తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే పట్టాలి: అంగన్వాడీ సిబ్బంది

తొలివెలుగు, దౌల్తాబాద్: నవజాత శిశువుల సక్రమ ఎదుగుదలకు, సంపూర్ణ ఆరోగ్యానికి తల్లిపాలే ప్రధాన ఆధారమని అంగన్వాడీ సిబ్బంది తెలిపారు. దుబ్బాక ప్రాజెక్టు పరిధిలోని దౌల్తాబాద్ మండలం ఇందుప్రియాల్ సెక్టార్‌కు చెందిన తిరుమలాపూర్ అంగన్వాడీ కేంద్రంలో గురువారం తల్లిపాల వారోత్సవాలను నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలోని గర్భిణులు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై ప్రత్యేక అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా అంగన్వాడీ కార్యకర్తలు మాట్లాడుతూ.. బిడ్డ పుట్టిన మొదటి గంటలోనే తల్లిపాలు పట్టడం ప్రారంభించాలని సూచించారు. ప్రసవించిన వెంటనే వచ్చే ముర్రుపాలు శిశువుకు తొలి వ్యాధి నిరోధక టీకాగా పనిచేస్తాయని వివరించారు. శిశువు పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, ఎలాంటి ఇతర ఆహారాలు, నీరు కూడా ఇవ్వకూడదని స్పష్టం చేశారు. ఆరు నెలలు పూర్తయిన తర్వాత అదనపు పోషకాహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువ కాలం తల్లిపాలను కొనసాగించాలని కోరారు. తల్లులు ఎలాంటి అపోహలకు లోనుకాకుండా ఆరోగ్య కార్యకర్తల సూచనలు పాటించాలన్నారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడీ టీచర్లు కళ్యాణి, అనిత, వినోద, ఆశా వర్కర్ రాణి తదితరులు పాల్గొన్నారు.

మహిళల భద్రతకు పోలీసు వ్యవస్థ నిరంతరం అండే

- జెన్‌టెక్ కంపెనీలో మహిళల భద్రతపై అవగాహన సదస్సు

- హాజరైన చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ జి. మన్మథ కుమార్

తొలివెలుగు, చౌటుప్పల్: కార్యాలయాల్లో మహిళల భద్రతకు ప్రాధాన్యమిస్తూ, వారి రక్షణకు పోలీసు వ్యవస్థ నిరంతరం అందుబాటులో ఉంటుందని చౌటుప్పల్ ఇన్‌స్పెక్టర్ ఆఫ్ పోలీస్ జి. మన్మథ కుమార్ తెలిపారు. చౌటుప్పల్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ధర్మోజీగూడెం గ్రామంలో ఉన్న జెన్‌టెక్ కంపెనీలో మహిళా ఉద్యోగులకు భద్రత, చట్టాలపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ మన్మథ కుమార్ మాట్లాడుతూ.. మహిళలు విధులు నిర్వహించే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు, ఈవ్‌టీజింగ్, లైంగిక వేధింపులు, సైబర్ నేరాల బారిన పడకుండా ఉండటానికి పాటించాల్సిన సూచనలను వివరించారు. మహిళలకు అందుబాటులో ఉన్న షీ టీమ్స్, విమెన్ సేఫ్టీ, మహిళలపై నేరాల నిరోధక విభాగం (సీడీడబ్ల్యూ) సేవలు, చట్టపరమైన రక్షణల గురించి సమగ్రంగా తెలియజేశారు. మహిళలు ఎలాంటి భయాందోళనలకు గురికాకుండా తమ సమస్యలను ధైర్యంగా పోలీసుల దృష్టికి తీసుకురావాలని, అత్యవసర సమయాల్లో వెంటనే పోలీసులను సంప్రదించాలని సూచించారు.

అంకిరెడ్డిగూడెంలో అదనపు పోలింగ్ బూత్ కేటాయించాలి

- ఆర్డీఓ శ్రీదేవికి బీఆర్ఎస్ నేతల విజ్ఞప్తి

- ఎస్ఐఆర్ సమీక్షా సమావేశంలో పలు ప్రతిపాదనలు

తొలివెలుగు, చౌటుప్పల్: ఓటర్ల సౌకర్యాన్ని, భవిష్యత్ అవసరాలను పరిగణనలోకి తీసుకుని పోలింగ్ కేంద్రాలను పునర్వ్యవస్థీకరించాలని చౌటుప్పల్ మండల బీఆర్ఎస్ అధ్యక్షుడు గిర్కటి నిరంజన్ గౌడ్, మున్సిపల్ అధ్యక్షుడు బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి కోరారు. చండూరు ఆర్డీఓ కార్యాలయంలో ఆర్డీఓ శ్రీదేవి అధ్యక్షతన నిర్వహించిన మునుగోడు నియోజకవర్గ స్థాయి ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్) సమీక్షా సమావేశంలో వారు పాల్గొని అధికారులకు వినతులు సమర్పించారు. ఈ సందర్భంగా గిర్కటి నిరంజన్ గౌడ్ మాట్లాడుతూ.. చౌటుప్పల్ మండలంలోని అంకిరెడ్డిగూడెం గ్రామపంచాయతీలో ఓటర్ల సంఖ్య గణనీయంగా పెరిగినందున అదనపు పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేయాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ఎల్లంబావి పంచాయతీకి ప్రత్యేక పోలింగ్ కేంద్రాన్ని కేటాయించాలని కోరారు. బొమ్మిరెడ్డి వెంకట్ రెడ్డి మాట్లాడుతూ.. చౌటుప్పల్ మున్సిపాలిటీ పరిధి వేగంగా విస్తరిస్తుండటంతో భవిష్యత్తులో వార్డుల సంఖ్య పెరిగే అవకాశం ఉందని, దానికి అనుగుణంగా వార్డుల వారీగా పోలింగ్ కేంద్రాల ఏర్పాటుకు ముందస్తు ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమీపంలో పోలింగ్ కేంద్రాలు ఉంటే ఓటింగ్ శాతం పెరుగుతుందని చెప్పారు. కార్యక్రమంలో పలువురు అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

చౌటుప్పల్ జూనియర్ సివిల్ జడ్జిగా శాలిని బాధ్యతల స్వీకరణ

- వేగవంతమైన న్యాయ సేవలే లక్ష్యం: న్యాయమూర్తి శాలిని

- ఘనంగా స్వాగతం పలికిన బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు

తొలివెలుగు, చౌటుప్పల్: చౌటుప్పల్ న్యాయస్థానంలో నూతనంగా నియమితులైన జూనియర్ సివిల్ జడ్జి శాలిని గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కోర్టు అధికారులు, బార్ అసోసియేషన్ ప్రతినిధులు, న్యాయవాదులు, కోర్టు సిబ్బంది ఆమెకు ఘన స్వాగతం పలికి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. అనంతరం జడ్జి శాలిని కోర్టు పరిపాలన, పెండింగ్ కేసుల త్వరితగతిన పరిష్కారం, న్యాయ సేవల సమర్థవంతమైన నిర్వహణకు సంబంధించిన అంశాలపై కోర్టు అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ప్రజలకు వేగవంతమైన, పారదర్శకమైన, నిష్పాక్షికమైన న్యాయ సేవలు అందించేందుకు కట్టుబడి పనిచేస్తానని స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్షుడు తాడూరు పరమేష్, జనరల్ సెక్రటరీ పడమటి మహిపాల్ రెడ్డి, ఉపాధ్యక్షుడు పిట్టల భిక్షమయ్య, జాయింట్ సెక్రటరీ మక్తాల నర్సింహా, నాయకులు ముత్యాల సత్తిరెడ్డి, రాధాకిషన్ రావు, కానుగుల వెంకటయ్య, బాల్యం చలపతి, ఉడుగు శ్రీనివాస్, ఎలామోని శ్రీనివాస్, రిక్కాల సుధాకర్ రెడ్డి, రాపోలు వేణు, జక్కర్తీ శేఖర్, ఖయ్యూమ్ పాషా, శ్రీశైలం, జ్యోతి, కిరణ్, భరత్, పాల పరమేష్, ఐతగోని శ్రీకాంత్, రాఘవేంద్ర, మల్లికార్జున్, బార్ అసోసియేషన్ సభ్యులు, కోర్టు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్రకులంలో పుట్టినా.. బడుగుల కోసమే పనిచేస్తా

సామాజిక తెలంగాణ సాధన కోసం తన పూర్తి జీవితాన్ని అంకితం చేస్తున్నట్లు 'తెలంగాణ రక్షణ సేన' (టీఆర్ఎస్) పార్టీ అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత ప్రకటించారు. అట్టడుగు, అణగారిన వర్గాలకు సమాన అవకాశాలు దక్కేవరకు తన పోరాటం ఆగదని స్పష్టం చేశారు. ప్రొఫెసర్ జయశంకర్ జయంతి సందర్భంగా సరూర్‌నగర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన "సామాజిక న్యాయ తెలంగాణ సంకల్ప సభ"లో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ సందర్భంగా కవిత మాట్లాడుతూ.. రాష్ట్రంలో 90 శాతం ఉన్న బహుజన వర్గాలకు రాజకీయ, సామాజిక అవకాశాల్లో తీవ్ర అన్యాయం జరుగుతోందని ఆవేదన వ్యక్తం చేశారు. "కేవలం 10 శాతం ఉన్న వర్గాలు 90 శాతం అవకాశాలను అనుభవిస్తున్నాయి. ప్రొఫెసర్ జయశంకర్ ఆశించిన సామాజిక తెలంగాణ సాధన కోసమే ఈ ఉద్యమం మొదలుపెట్టాం" అని తెలిపారు. తన కులంపై వస్తున్న విమర్శలను ప్రస్తావిస్తూ "నా పుట్టుక నా చేతిలో లేదు. కానీ ఎవరి కోసం పనిచేయాలో నిర్ణయించుకునే హక్కు నాకుంది" అని చెప్పారు. కాంగ్రెస్ ప్రభుత్వం బీసీ జనాభా లెక్కల్లో మోసానికి పాల్పడిందని కవిత ఆరోపించారు. బీసీ రిజర్వేషన్ల బిల్లుకు రాష్ట్రపతి ఆమోదం కోసం సీఎం రేవంత్ రెడ్డి, కేంద్రమంత్రి కిషన్ రెడ్డి కలిసి ఎందుకు పనిచేయడం లేదని ప్రశ్నించారు. రాబోయే అసెంబ్లీ బడ్జెట్ సమావేశాల్లోగా బీసీ బిల్లును ఆమోదించి కేంద్రానికి పంపకపోతే, 1,000 కార్లతో 'ఛలో ఢిల్లీ' కార్యక్రమం చేపడతామని హెచ్చరించారు. ఈ సభలో భాగంగా చట్టసభల్లో బీసీలకు 50 శాతం రిజర్వేషన్లు కల్పించాలని, పూలే దంపతులకు భారతరత్న ఇవ్వాలని, ట్యాంక్‌బండ్‌పై జయశంకర్ విగ్రహం ఏర్పాటు చేయాలనే డిమాండ్లతో పాటు మొత్తం 11 తీర్మానాలను ఆమోదించారు.

ఇంగ్లిష్ విద్య అవసరం: మదర్సాలపై మాధవీలత కీలక వ్యాఖ్యలు

బీజేపీ నేత మాధవీలత మదర్సాలపై కీలక వ్యాఖ్యలు చేశారు. మదర్సాలలో జాతీయ గీతం 'జన గణ మన', జాతీయ గేయం 'వందేమాతరం' ఆలపించడాన్ని తప్పనిసరి చేయాలని డిమాండ్ చేశారు. విద్యార్థుల్లో దేశభక్తిని పెంపొందించడంతో పాటు, వారికి ఆంగ్ల విద్యను కూడా అందించాలని సూచించారు. హైదరాబాద్‌లో అమె మాట్లాడుతూ, "ఇది కేవలం మద్దతు తెలపాల్సిన విషయం కాదు. వాస్తవాలను గుర్తించాల్సిన అంశం. మదర్సాలలో ఆంగ్ల విద్యను ప్రవేశపెట్టాలి. అక్కడి పిల్లలను బాహ్య ప్రపంచానికి పరిచయం చేయాలి. వారిలో దేశభక్తిని పెంపొందించాలి. వందేమాతరంతో పాటు జాతీయ గీతాన్ని తప్పనిసరిగా ఆలపించాలి. 'భారత్ మాతాకీ జై' అని నినదించేలా విద్యార్థులను సిద్ధం చేయాలి" అని పేర్కొన్నారు. విద్యాసంస్థలలో వందేమాతరం ప్రాముఖ్యతపై దేశవ్యాప్తంగా చర్చ జరుగుతున్న నేపథ్యంలో మాధవీలత చేసిన ఈ వ్యాఖ్యలు ప్రాధాన్యం సంతరించుకున్నాయి. ఇటీవలే పశ్చిమ బెంగాల్ ప్రభుత్వం కూడా గుర్తింపు పొందిన మదర్సాలలో వందేమాతరం ఆలపించడాన్ని తప్పనిసరి చేస్తూ నిర్ణయం తీసుకుంది. అయితే, ప్రభుత్వ నిర్ణయాన్ని కొందరు కలకత్తా హైకోర్టులో సవాలు చేశారు. గత లోక్‌సభ ఎన్నికల్లో హైదరాబాద్ స్థానం నుంచి బీజేపీ అభ్యర్థిగా మాధవీలత పోటీ చేసిన విషయం తెలిసిందే.

డేటా సెంటర్ల హబ్‌గా హైదరాబాద్.. విశాఖపై ప్రపంచ దిగ్గజాల చూపు

భారత్ డేటా సెంటర్ రంగంలో వేగంగా దూసుకెళ్తోంది. ఇప్పటికే హైదరాబాద్ ప్రపంచంలోనే అత్యంత వేగంగా అభివృద్ధి చెందుతున్న డేటా సెంటర్ కేంద్రాల్లో ఒకటిగా నిలిచింది. విశాఖపట్నం భారీ స్థాయి కొత్త డేటా సెంటర్ ప్రాజెక్టులకు ఆకర్షణీయ గమ్యంగా మారుతోంది. ఈ విషయాలు నైట్ ఫ్రాంక్ విడుదల చేసిన తాజా నివేదికలో వెల్లడయ్యాయి. ప్రపంచంలోని 36 ప్రధాన డేటా సెంటర్ మార్కెట్లపై నిర్వహించిన అధ్యయనంలో ముంబయి ఆపరేషనల్ సామర్థ్యం పరంగా 15వ స్థానంలో నిలిచింది. అభివృద్ధి దశలో ఉన్న ప్రాజెక్టుల జాబితాలో 11వ స్థానాన్ని దక్కించుకుంది. హైదరాబాద్ ప్రస్తుతం 151 మెగావాట్ల సామర్థ్యంతో 27వ స్థానంలో ఉన్నా, 2.2 గిగావాట్లకు పైగా అభివృద్ధి ప్రణాళికలతో 19వ స్థానంలో నిలిచి వేగంగా విస్తరిస్తున్న కేంద్రంగా గుర్తింపు పొందింది. చెన్నై అగ్నేయాసియా ఇంటర్నెట్ ట్రాఫిక్‌కు కీలక కేంద్రంగా బలపడుతుండగా, బెంగళూరు గ్లోబల్ కెపబిలిటీ సెంటర్లు, పరిశోధన సంస్థల పెట్టుబడులను ఆకర్షిస్తోంది. మరోవైపు పూణె, ఢిల్లీ ఎన్‌సీటీ ప్రాంతంలో కూడా డేటా సెంటర్ల సామర్థ్యం పెరుగుతోంది. రెండో శ్రేణి నగరాల్లో విశాఖపట్నం, జామ్‌నగర్ భారీ గ్రీన్‌ఫీల్డ్ డేటా సెంటర్ ప్రాజెక్టులకు పెట్టుబడులను ఆకర్షిస్తున్నాయని నివేదిక పేర్కొంది. ప్రభుత్వ ప్రోత్సాహక విధానాలు, సముద్రగర్భ కేబుల్ కనెక్టివిటీ ప్రణాళికలు ఇందుకు దోహదపడుతున్నాయని వెల్లడించింది. క్లౌడ్ సేవల వినియోగం పెరగడం, కృత్రిమ మేధ వినియోగం విస్తరించడం, డిజిటల్ ఆర్థిక వ్యవస్థ వేగంగా ఎదగడం వల్ల భారత్‌లో డేటా సెంటర్లకు డిమాండ్ మరింత పెరుగుతోందని నైట్ ఫ్రాంక్ ఇండియా అభిప్రాయపడింది. విద్యుత్ సరఫరా, మౌలిక వసతుల విస్తరణ, వేగవంతమైన అనుమతులు ఉంటే రానున్న దశాబ్దంలో భారత్ ప్రపంచంలోనే కీలక డేటా సెంటర్ల కేంద్రంగా ఎదిగే అవకాశముందని పేర్కొంది.

డీప్‌ఫేక్‌లపై కేంద్రం ఉక్కుపాదం.. 3 గంటల్లో తొలగించాల్సిందే

ఫిర్యాదుల కోసం అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్

సోషల్ మీడియాలో కృత్రిమ మేధ (ఏఐ) సాయంతో రూపొందుతున్న డీప్‌ఫేక్ వీడియోలు, ఆడియోలు, ఫొటోలకు అడ్డుకట్ట వేసేందుకు కేంద్ర ప్రభుత్వం నిబంధనలను మరింత కఠినతరం చేసింది. అక్రమ కంటెంట్‌పై ఫిర్యాదు అందిన మూడు గంటల్లోనే తొలగించాలని మధ్యవర్తి వేదికలకు (ఇంటర్మీడియరీలు) ఆదేశాలు జారీ చేసింది. గతంలో ఈ గడువు 36 గంటలు ఉండేది. లోక్‌సభలో కేంద్ర ఎలక్ట్రానిక్స్, ఐటీ శాఖ సహాయ మంత్రి జితిన్ ప్రసాద ఈ వివరాలు వెల్లడించారు. డీప్‌ఫేక్‌లు, ఏఐతో రూపొందించిన తప్పుడు సమాచారం పెరుగుతున్న నేపథ్యంలో ఐటీ నిబంధనలను బలోపేతం చేసినట్లు చెప్పారు. నగ్న చిత్రాలు, వ్యక్తుల వేషధారణను అనుకరించడం, అశ్లీల కంటెంట్ వంటి సున్నితమైన అంశాలపై వచ్చే ఫిర్యాదులను ఇకపై రెండు గంటల్లోనే పరిష్కరించాలని స్పష్టం చేశారు. గతంలో ఇందుకు 24 గంటల గడువు ఉండేది. ఏఐతో రూపొందించిన కంటెంట్‌కు స్పష్టమైన గుర్తింపు, సోర్స్ వివరాలు తప్పనిసరిగా ఉండేలా చర్యలు తీసుకోవాలని సోషల్ మీడియా వేదికలను కేంద్రం ఆదేశించింది. దీంతో వినియోగదారులు అది నిజమైనదా, కృత్రిమంగా రూపొందించిందా అనేది సులభంగా గుర్తించే అవకాశం ఉంటుంది. చట్టాలను ఉల్లంఘించే డీప్‌ఫేక్ కంటెంట్ తయారీ, ప్రచారాన్ని అడ్డుకునేందుకు ఆటోమేటెడ్ సాంకేతిక వ్యవస్థలను వినియోగించాలని కూడా సూచించింది. బాలల లైంగిక దోపిడీ, అనుమతి లేకుండా వ్యక్తిగత చిత్రాల ప్రచారం, వేషధారణ మోసాల వంటి కంటెంట్‌పై వెంటనే చర్యలు తీసుకోవాలని స్పష్టం చేసింది. డీప్‌ఫేక్‌లను గుర్తించేందుకు ఐఐటీ జోధ్‌పూర్, ఐఐటీ మద్రాస్, ఐఐటీ ఖరగ్‌పూర్ అభివృద్ధి చేసిన ప్రత్యేక వ్యవస్థలను కూడా కేంద్రం ప్రస్తావించింది. అలాగే ఫిర్యాదుల పరిష్కారం కోసం గ్రీవెన్స్ అధికారుల నియామకం, కేంద్ర స్థాయిలో అప్పీల్ వ్యవస్థ, 'సహయోగ్' పోర్టల్‌ను కూడా అందుబాటులో ఉంచినట్లు తెలిపింది.



తగ్గిన దేశ వృద్ధిరేటు.. కొత్త సిరీస్‌లో జీడీపీ గణాంకాలు విడుదల

అక్టోబర్-డిసెంబర్‌లో 7.8 శాతంగా నమోదు

అంతకుముందు త్రైమాసికంలో 8.4 శాతంగా రికార్డు

ఈ ఆర్థిక సంవత్సరం 7.6 శాతంగా అంచనా

న్యూఢిల్లీ: దేశ జీడీపీ వృద్ధిరేటు తగ్గుముఖం పట్టింది. పాత సిరీస్‌ను కాదని, కొత్త సిరీస్‌ను తెచ్చి లెక్కించినా.. భారతీయ ఆర్థిక వ్యవస్థలో నెలకొన్న నిస్తేజాన్ని దాచలేకపోయింది నరేంద్ర మోదీ సర్కార్. ఈ ఆర్థిక సంవత్సరం (2025-26) మూడో త్రైమాసికం (అక్టోబర్-డిసెంబర్)లో ఆర్థిక ప్రగతి రేటు 7.8 శాతంగానే ఉన్నట్టు తేలింది మరి. అంతకుముందు త్రైమాసికం (జూలై-సెప్టెంబర్)తో పోల్చితే 0.6 శాతం పడిపోయింది. నాడు 8.4 శాతంగా ఉన్నది. శుక్రవారం కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ.. 2022-23 బేస్ ఇయర్ (ఆధారిత సంవత్సరం)తో నూతన వార్షిక, త్రైమాసిక జాతీయ పద్దు అంచనాల సిరీస్‌ను విడుదల చేసింది. ఇప్పటిదాకా ఉన్న 2011-12 బేస్ ఇయర్ జీడీపీ గణన సిరీస్ స్థానంలో దీన్ని తీసుకొచ్చింది. కాగా, జీడీపీ గణనకు బేస్ ఇయర్‌లను ఇలా సవరించడం ఇది తొమ్మిదోసారి.

ఇదీ సంగతి..

కొత్త సిరీస్‌తో దేశ జీడీపీ లెక్కింపు పద్ధతిని కేంద్రం సవరించింది. బేస్ ఇయర్‌ను మార్చడమేగాక, దేశంలోని ఆర్థిక కార్యకలాపాలన్నీ ప్రతిబింబించేలా వస్తు, సేవల పన్ను (జీఎస్టీ), ఈ-వాహన్ పోర్టల్‌ల డాటానూ జీడీపీ గణనకు అనుసంధానం చేశారు. ఇంతకుముందు జీఎస్టీ, ఈ-వాహన్ పోర్టల్ డాటా.. జీడీపీ లెక్కింపు పరిధిలోకి వచ్చేది కాదు. ఇదిలావుంటే కొత్త సిరీస్ నేపథ్యంలో ప్రస్తుత ఆర్థిక సంవత్సరం రెండో త్రైమాసికం జీడీపీ గణాంకాలను కేంద్రం సవరించింది. పాత సిరీస్ ప్రకారం 8.2 శాతంగా ఉంటే.. ఇప్పుడది 8.4 శాతానికి పెరిగింది. దీంతో చూస్తే.. అక్టోబర్-డిసెంబర్ జీడీపీ వృద్ధిరేటు 0.6 శాతం పడిపోయి 7.8 శాతానికే పరిమితమైంది. అయితే గత ఆర్థిక సంవత్సరం (2024-25) అక్టోబర్-డిసెంబర్‌తో పోల్చితే మాత్రం పెరిగింది. అప్పుడు 7.4 శాతంగా ఉన్నది. ఇక ఈసారి తయారీ, సేవా రంగాల్లో వృద్ధి కనిపించినట్టు కేంద్రం చెప్తున్నది.

ఈసారి 7.6 శాతం

ప్రస్తుత ఆర్థిక సంవత్సరం దేశ జీడీపీ వృద్ధిరేటు 7.6 శాతంగా నమోదు కావచ్చని ఈ సందర్భంగా కేంద్ర ప్రభుత్వం అంచనా వేసింది. పాత సిరీస్‌లో ఈ అంచనా 7.4 శాతంగానే ఉన్నది. 2024-25 ఆర్థిక సంవత్సరంలో 7.1 శాతంగా నమోదైన సంగతి విదితమే. కాగా, జీడీపీ గణనలో బేస్ ఇయర్ మార్పుతో దేశంలోని ఆర్థిక కార్యకలాపాల అసలు విలువ మరింత స్పష్టంగా తెలుస్తుందని మోదీ సర్కార్ భావిస్తున్నది. అందుకే మొత్తం ఆర్థిక సంవత్సరం జీడీపీ అంచనాను పెంచింది. ఇక ఈ 2025-26లో దేశ జీడీపీ విలువ రూ.322.58 లక్షల కోట్లుగా ఉండొచ్చని అంచనా. 2024-25లో రూ.299.89 లక్షల కోట్లుగా ఉన్నట్టు కేంద్ర గణాంకాలు, కార్యక్రమ అమలు మంత్రిత్వ శాఖ చెప్తున్నది.

వచ్చేసారి 7-7.4% : సీఈఏ

వచ్చే ఆర్థిక సంవత్సరం (2026-27) దేశ జీడీపీ వృద్ధిరేటు 7-7.4 శాతంగా ఉండొచ్చని ప్రధాన ఆర్థిక సలహాదారు (సీఈఏ) వీ అనంత నాగేశ్వరన్ అంచనా వేశారు. అయితే గత నెల జనవరిలో కేంద్ర బడ్జెట్‌కు ముందు పార్లమెంట్‌లో ప్రవేశపెట్టిన ఆర్థిక సర్వేలో మాత్రం ఈ అంచనా 6.8-7.2 శాతంగానే ఉన్నది. జీడీపీ గణనకు కొత్త సిరీస్ విడుదలైన నేపథ్యంలో ఇదిప్పుడు ప్రాధాన్యాన్ని సంతరించుకుంటున్నది. కాగా, దేశ ఆర్థిక వ్యవస్థ పరిమాణం 4 లక్షల కోట్ల డాలర్ల మార్కును కూడా దాటగలదన్న విశ్వాసాన్ని కొత్త సిరీస్ ప్రకటన సందర్భంగా ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన వ్యక్తం చేశారు.

హైదరాబాద్‌లో రూ.350 కోట్లతో లగ్జరీ హోటల్

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ హైదరాబాద్‌లో దాదాపు రూ. 350 కోట్లతో లగ్జరీ హోటల్‌ని అభివృద్ధి చేయనున్నట్లు వెల్లడించింది. దీన్ని చాలెట్ హోటల్స్‌కి ప్రీ--లీజుకి ఇచ్చినట్లు తెలిపింది. 5.3 లక్షల చ.అ. విస్తీర్ణంలో ఉండే ఈ ప్రాజెక్టులో 330 గదులు ఉంటాయి. 2027--28 నాలుగో త్రైమాసికంలో ఇది పూర్తయ్యే అవకాశం ఉందని మైండ్‌స్పేస్ బిజినెస్ పార్క్స్ రీట్ తెలిపింది.ఇరు సంస్థల మధ్య ఒప్పందం ప్రకారం మైండ్‌స్పేస్ రీట్‌కి చెందిన స్పెషల్ పర్పస్ వెహికల్ సంస్థ సదరు ప్రాపర?టని స్థూలంగా నిర్మించి ఇస్తుంది. ఇంటీరియర్స్, హోటల్ నిర్వహణ మొదలైన పనులను చాలెట్ చేపడుతుంది. ప్రస్తుతం చాలెట్‌కి మొత్తం మీద 3,300 గదుల పోర్ట్‌ఫోలియో ఉంది. మైండ్‌స్పేస్ రీట్‌కి హైదరాబాద్‌తో పాటు ముంబై, పుణె చెన్నైలలో ఆఫీస్ అసెట్స్, బిజినెస్ పార్క్‌లు ఉన్నాయి.

ఐటీ కొత్త రూల్: ఇంటి ఓనర్‌తో సంబంధం చెప్పాలి

ఆదాయపన్ను ముసాయిదా పత్రాలను ప్రభుత్వం విడుదల చేసింది. ఇంటి అద్దెపై పన్ను మినహాయింపును క్లెయిమ్ చేసుకునే వారు ఇకపై ఇంటి యజమానితో చేసుకున్న ఒప్పంద రుజువును చూపించాల్సి ఉంటుంది. ఏప్రిల్ 1 నుంచి కొత్త ఆదాయపన్ను చట్టం అమల్లోకి రానుండడం గమనార్హం. దీంతో ముసాయిదా పత్రాలు, నిబంధనలపై భాగస్వాములకు ఆదాయపన్ను శాఖ పంపిణీ చేసింది. వేతన జీవులు హెచ్‌ఆర్ఏ క్లెయిమ్‌ను చేసుకునే విషయంలో యాజమాన్యానికి ధ్రువీకరణ ఇవ్వాల్సి ఉంటుంది. ఇకపై ఫారమ్ 124లో ప్రాపర్టీ యజమానితో ఉన్న సంబంధాన్ని (అసెసీ/పన్ను చెల్లింపుదారు/దాఖలుదారు) వెల్లడించాల్సి ఉంటుంది. కల్పిత, పెంచి చూపించే అద్దె మొత్తాలకు ఈ నిబంధన చెక్ పెడుతుందని పన్ను నిపుణులు అభిప్రాయపడుతున్నారు. విదేశీ ఆదాయంపై పన్ను జమ క్లెయిమ్‌లకు సంబంధించి ఆడిటర్లు, కంపెనీలపై బాధ్యతను పెంచడం కూడా కొత్త పత్రాల్లో భాగంగా ఉంది. భారత్‌కు వెలుపల ఏదైనా ప్రాంతానికి సంబంధించిన ఆదాయంపై ఫారిన్ ట్యాక్స్ క్రెడిట్‌హోల్డింగ్ సర్టిఫికెట్లను అకౌంటెంట్లు స్వతంత్రంగా నిర్ధారించుకోవాల్సి ఉంటుంది. చెల్లింపుల రుజువులు, కరెన్సీ మారకం లావాదేవీలు, పన్ను అర్హత నిబంధనలను, పన్ను చెల్లింపుదారు నివాస హోదాలను సైతం ధ్రువీకరించుకోవాల్సి ఉంటుంది.

కమర్షియల్ గ్యాస్ వినియోగదారులకు ఊరట..

భారీగా తగ్గిన సిలిండర్ ధర

వాణిజ్య అవసరాలకు వినియోగించే గ్యాస్ ను వినియోగించే వారికి చమురు కంపెనీలు (ూఅశ్రీ జశీఎజూఅఅవం) ఊరట కల్పించాయి. 19 కేజీల కమర్షియల్ ఎల్‌పీజీ సిలిండర్ (ూ్రా+ ఎఎశ్రీఅఅనవతీ జూతీఅఎవ) ధరను భారీగా తగ్గించాయి. ఈ ఏడాది వాణిజ్య సిలిండర్ (జశీఎఎవతీఎఱుశ్రీ జఎశ్రీఅఅనవతీ) ధర తగ్గడం ఇదే మొదటిసారి. ఇవాళ్టి నుంచే ఈ కొత్త ధరలు అమల్లోకి వచ్చాయి. ఢిల్లీలో కమర్షియల్ సిలిండర్‌పై రూ.183.50 మేర ధర తగ్గింది. దాంతో అక్కడ సిలిండర్ ధర రూ.3,113.50 నుంచి రూ.2,930 కి చేరింది. కోల్‌కతాలో రూ.174 తగ్గడంతో ధర రూ.3,081.50కి, చండీగఢ్‌లో రూ.181.50 తగ్గింపుతో రూ.2,954.50కి, పట్నాలో రూ.173 తగ్గింపుతో రూ.3,227కి ధరలు దిగివచ్చాయి. అదేవిధంగా హైదరాబాద్‌లో రూ.176 తగ్గి సిలిండర్ ధర రూ.3,191కి చేరింది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు తగ్గడమే ఈ ధరల తగ్గింపునకు ప్రధాన కారణంగా తెలుస్తోంది. అమెరికా, ఇరాన్ దేశాల మధ్య కాల్పుల విరమణ ఒప్పందాన్ని 60 రోజులపాటు పొడిగించడంతో చమురు ధరలు దిగివచ్చాయి. దాంతోపాటు ప్రపంచంలోని 20 శాతం చమురు రవాణా జరిగే హర్మూజ్ జలసంధి గుండా నౌకల రాకపోకలపై ఒత్తిడి తగ్గింది. అయితే, గృహ వినియోగదారులకు మాత్రం ఈసారి కూడా ఎలాంటి శుభవార్త అందలేదు. 14.2 కేజీల డొమెస్టిక్ సిలిండర్ ధరల్లో ఎలాంటి మార్పు చేయలేదు. ప్రస్తుతం ఢిల్లీలో గృహ వినియోగ సిలిండర్ ధర రూ.942, కోల్‌కతాలో రూ.968, ముంబైలో రూ.941.50, చెన్నైలో రూ.957.50, హైదరాబాద్‌లో రూ.994 వద్ద స్థిరంగా కొనసాగుతోంది.

రెండోరోజూ నష్టాల్లో సూచీలు

ముంబై, జూన్ 30 : దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా రెండోరోజూ నష్టాల్లో ముగిశాయి. ఐటీ, ఆయిల్ అండ్ గ్యాస్, పలు బ్యాంకింగ్ షేర్లలో అమ్మకాలు పోటెత్తడంతోపాటు అమెరికా-ఇరాన్ దేశాల మధ్య జరిగే చర్చలపై అనిశ్చితి నెలకొనడం మదుపరుల్లో సెంటిమెంట్‌ను నీరుగార్చింది. ఒక దశలో 400 పాయింట్ల వరకు నష్టపోయిన 30 షేర్ల ఇండెక్స్ సూచీ సెన్సెక్స్ చివరకు మార్కెట్ ముగిసే సమయానికి 249.70 పాయింట్లు కోల్పోయి 76,478.67 వద్ద ముగిసింది. మరో సూచీ ఎన్‌ఎస్ఈ నిఫ్టీ 80.50 పాయింట్లు కోల్పోయి 23,865.75 వద్ద స్థిరపడింది. దేశవ్యాప్తంగా వర్షాభావ పరిస్థితులు నెలకొనడం, విదేశీ పెట్టుబడులు తరలిపోతుండటం, బ్లూచిప్ సంస్థల షేర్లు కుప్పకూలడం మార్కెట్లో సెంటిమెంట్‌ను నీరుగార్చిందని దలాల్‌స్ట్రీట్ వర్గాలు వెల్లడించాయి. సూచీల్లో ఇన్ఫోసిస్, టీసీఎస్, హెచ్‌సీఎల్ టెక్నాలజీ, టెక్ మహీంద్రా, ఐటీసీ, హెచ్‌యూఎల్ షేర్లు భారీగా నష్టపోయాయి. కానీ, మారుతి, టైటాన్, బజాజ్ ఫైనాన్స్, ఎటర్నల్ షేర్లు లాభాల్లో ముగిశాయి. దేశీయ స్టాక్ మార్కెట్లు దిద్దుబాటునకు గురయ్యాయని, అంతర్జాతీయ మార్కెట్ల నుంచి వచ్చిన మిశ్రమ ట్రెండింగ్‌ను మరింత నష్టాల్లోకి నెట్టాయని జియోజిట్ ఇన్వెస్ట్‌మెంట్స్ లిమిటెడ్ రీసర్చ్ హెడ్ వినోద్ నాయర్ తెలిపారు. రంగాలవారీగా ఐటీ సూచీ అత్యధికంగా 2.62 శాతం నష్టపోగా, పీఎస్‌యూ బ్యాంకింగ్, మెటల్, యుటిలిటీ, ప్రైవేట్ బ్యాంకింగ్ రంగ సూచీ నష్టాల్లోకి జారుకున్నాయి. కానీ, రియల్టీ, సర్వీసెస్, కన్జ్యూమర్ డ్యూరబుల్, హెల్త్‌కేర్, క్యాపిటల్ గూడ్స్, కమోడిటీస్ రంగ సూచీలు లాభాల్లోకి వచ్చాయి.



టాటా సియారా ఈవీ.. ప్రారంభ ధర రూ.18.79 లక్షలు

న్యూఢిల్లీ, జూన్ 30 : ప్రముఖ ఆటోమొబైల్ దిగ్గజం టాటా మోటర్స్ దేశీయ మార్కెట్‌కు మరో ఈవీ మాడల్‌ను తీసుకొచ్చింది. సియారీ ఈవీ పేరుతో విడుదల చేసిన ఈ మాడల్ రు ప్రారంభ ధరను రూ.18.79 లక్షలుగా నిర్ణయించిన సంస్థ..గరిష్ఠంగా రూ.24.79 లక్షలుగా నిర్ణయించింది. బుకింగ్‌లు ప్రారంభించిన సంస్థ..జూలై 15 నుంచి డెలివరీ చేయనున్నట్టు ప్రకటించింది. కేవలం 5.8 సెకండ్లలోనే 100 కిలోమీటర్ల వేగాన్ని అందుకోనున్నది. 75 కిలోవాట్ల బ్యాటరీ సింగిల్ చార్జింగ్‌తో 665 కిలోమీటర్ల వరకు మైలేజీ ఇవ్వనున్నది. అలాగే 63 కిలోవాట్ల బ్యాటరీ మాడల్ 565 కిలోమీటర్లకు పైగా మైలేజీ ఇవ్వనున్నది. కారుతోబే యూపీఐ చెల్లింపులు జరుపడంతోపాటు ఎయిర్‌కన్సోల్ గేమింగ్, ఈవీ రూట్ ప్లాన్ కూడా చేసుకోవచ్చునని తెలిపింది.

వెండి పరుగులు

న్యూఢిల్లీ, జూన్ 30 : గత కొన్ని రోజులుగా తగ్గుతూ వచ్చిన వెండి ధరలు ఒక్కసారిగా భారీగా పుంజుకున్నాయి. పారిశ్రామిక వర్గాలు, నాణేల తయారీదారుల నుంచి కొనుగోళ్లు ఊపందుకోవడంతో కిలో వెండి ఏకంగా రూ.6 వేలు ఎగబాకి రూ.2.30 లక్షలకు చేరుకున్నది. కానీ, బంగారం ధరలు మరింత తగ్గాయి. డిమాండ్ పడిపోవంతో న్యూఢిల్లీ బులియన్ మార్కెట్లో 99.9 శాతం స్వచ్ఛత కలిగిన పదిగ్రాముల గోల్డ్ ధర రూ.800 తగ్గి రూ.1,45,800కి పడిపోయింది. అంతకుముందు ఇది రూ.1,46,600 గా ఉన్నట్టు ఆల్ ఇండియా సరఫా అసోసియేషన్ వెల్లడించింది.

అక్షయ్‌ఖన్నాకు ప్రశాంత్ గ్రీటింగ్స్

మహాకాళిపై త్వరలోనే వివరాలు వెల్లడిస్తామని ప్రకటన

బాలీవుడ్ నటుడు అక్షయ్ ఖన్నా కేవలం తన నటనతోనే మాట్లాడతారని, ఆయనతో కలిసి పనిచేయడం తనకు దక్కిన గౌరవమని ప్రశాంత్ వర్మ పేర్కొన్నారు. ఈ సందర్భంగా సోషల్ మీడియా వేదికగా ప్రశాంత్ వర్మ ప్రత్యేక పోస్ట్‌ను పంచుకున్నాడు. నిజమైన టాలెంట్‌కు అరుపులు అవసరం లేదని నిరూపించే నటుడు అక్షయ్ ఖన్నా. ఆయన స్క్రీన్ ప్రెజెన్స్, పెర్ఫార్మెన్స్ ఎప్పుడూ ఒక ప్రత్యేకమైన క్లాస్‌ను చాటుతాయని ప్రశాంత్ వర్మ కొనియాడారు. అలాగే ప్రశాంత్ వర్మ తన సినిమాటిక్ యూనివర్స్ లో భాగంగా వీరిద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న 'మహాకాళి', 'అధీర', మరియు 'జై హనుమాన్' చిత్రాల గురించి త్వరలోనే మరిన్ని అప్‌డేట్స్ ఇస్తామని హింట్ ఇచ్చాడు. అక్షయ్ ఖన్నా ప్రస్తుతం ప్రశాంత్ వర్మ నిర్మిస్తున్న 'మహాకాళి' చిత్రంలో అసుర గురువు 'శుక్రాచార్యుడి' పాత్రలో నటిస్తున్నారు. ఇది ఆయనకు తెలుగులో తొలి చిత్రం కావడం విశేషం. ప్రస్తుతం అక్షయ్ ఖన్నాకు సంబంధించిన షూటింగ్ పార్ట్ పూర్తయిందని, అవుట్‌పుట్ చాలా అద్భుతంగా వచ్చిందని చిత్ర యూనిట్ వర్గాలు చెబుతున్నాయి. ప్రశాంత్ వర్మ క్రియేట్ చేస్తున్న ఈ మైథలాజికల్ యూనివర్స్ కోసం ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్నారు.

చెల్లి నిర్మాత...అన్న హీరోగా బరిలోకి వరుణ్‌తేజ్ కొత్త సినిమాకు పవన్ క్లాప్

మెగా ప్రిన్స్ వరుణ్ తేజ్ హీరోగా, ఆయన సోదరి నిహారిక కొణిదెల నిర్మాణంలో తెరకెక్కుతున్న తాజా చిత్రం 'బరి' శనివారం ఘనంగా ప్రారంభమైంది. పింక్ ఎలిఫెంట్ పిక్చర్స్ పతాకంపై రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌కు యువ దర్శకుడు యదువంశీ దర్శకత్వం వహిస్తున్నారు. అట్టహాసంగా పూజా కార్యక్రమాలు నిర్వహించగా పవర్ స్టార్ పవన్ కళ్యాణ్ ముఖ్య అతిథిగా హాజరై చిత్ర యూనిట్‌ను ఆశీర్వదించారు. ముహూర్తపు సన్నివేశానికి పవన్ కళ్యాణ్ స్వయంగా క్లాప్ కొట్టడం ఈ కార్యక్రమానికి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఈ సందర్భంగా వరుణ్ తేజ్ భావోద్వేగానికి లోనవుతూ, తన బిజీ షెడ్యూల్ మధ్య కూడా పవన్ కళ్యాణ్ హాజరై ఆశీర్వదించడం తనకు ఎంతో ఆనందాన్ని కలిగించిందని తెలిపారు. మెగా ఫ్యామిలీ మొత్తం ఒకే వేదికపై కనిపించిన ఫోటోలు ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. స్పోర్ట్స్ డ్రామాలు, వాస్తవిక కథలు అంటే మలయాళ సినిమాల వైపు చూస్తారనే అభిప్రాయం ఉందని, తెలుగు చిత్ర పరిశ్రమలో కూడా గొప్ప కంటెంట్ ఉందని, మన సంస్కృతి, మన విలువలను ప్రతిబింబించేలా సినిమాలు తెరకెక్కించగల సామర్థ్యం తమకుందని దర్శకుడు యదువంశీ స్పష్టం చేశారు. గతంలో కొత్త కాన్సెప్ట్‌లతో తెలుగు సినిమాలు సక్సెస్ సాధించిన ఉదాహరణలు ఉన్నాయని గుర్తుచేస్తూ, 'బరి'తో ప్రేక్షకులను కొత్త అనుభూతి కలిగించే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. 'కమిటీ కుర్రోళ్లు' చిత్రంతో గుర్తింపు పొందిన యదు వంశీ, మొదటి సినిమాతోనే మంచి పేరు తెచ్చుకున్నారు. ఇప్పుడు వరుణ్ తేజ్‌తో కలిసి రూరల్ స్పోర్ట్స్ డ్రామాగా 'బరి'ని రూపొందిస్తున్నారు. ఈ సినిమాలో వరుణ్ తేజ్ వాలీబాల్ ప్లేయర్ పాత్రలో కనిపించనుండటం విశేషం. సంక్రాంతి 2027 కానుకగా ఈ చిత్రాన్ని విడుదల చేయాలని మేకర్స్ ప్లాన్ చేస్తున్నారు.

కొత్త సినిమా కోసం మారుతి కసరత్తు



రాజా సాబ్ సినిమాతో ఆశించిన విజయాన్ని అందుకోలేకపోయిన దర్శకుడు మారుతి సైలెంట్ అయ్యారు. ఈ నేపథ్యంలో కొంతకాలంగా సైలెంట్‌గా ఉన్న మారుతి తాజాగా తన తదుపరి ప్రాజెక్ట్‌పై అప్డేట్ ఇచ్చాడు. తన కొత్త సినిమా స్క్రిప్ట్ ప్రస్తుతం చివరి దశలో ఉందని, ఈ ప్రాజెక్ట్‌కు శ్రీరాముడి ఆశీస్సులు ఉన్నాయని ఆయన పేర్కొన్నాడు.ఇదిలా ఉండగా, మారుతి తదుపరి సినిమాకు 'హ్యాపీ పాంగల్' అనే టైటిల్ పరిశీలనలో ఉన్నట్లు సమాచారం. ఈ చిత్రాన్ని ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా, తనకు సొంతమైన కామెడీ శైలిలో తెరకెక్కించనున్నట్లు టాక్ వినిపిస్తోంది. ఈ సినిమాలో మెగా హీరో వైష్ణవ్ తేజ్ హీరోగా నటించే అవకాశాలు ఉన్నాయని సినీ వర్గాలు చెబుతున్నాయి. ఇప్పటివరకు అధికారిక ప్రకటన రానప్పటికీ, ఈ కాంబినేషన్‌పై ఇప్పటికే ఆసక్తి నెలకొంది. 'రాజాసాబ్' ఫలితం తర్వాత మారుతి మరింత జాగ్రత్తగా స్క్రిప్ట్‌పై పని చేస్తున్నట్లు కనిపిస్తోంది. తన తదుపరి సినిమాతో మళ్లీ హిట్ ట్రాక్‌లోకి రావాలని ఈ దర్శకుడు భావిస్తున్నట్లు తెలుస్తోంది. త్వరలోనే ఈ ప్రాజెక్ట్‌పై పూర్తి వివరాలు వెల్లడయ్యే అవకాశం ఉంది.



రిషబ్‌శెట్టి సంచలన నిర్ణయం

హోంబలే ఫిల్మ్స్ సహా పలువురి సోషల్ మీడియా అన్‌ఫాలో

దక్షిణాది సినీ పరిశ్రమలో సోషల్ మీడియా ప్రభావం ఎలా ఉంటుందో మరోసారి రుజువైంది. రిషబ్ శెట్టి చేసిన పని ఇప్పుడు టాలీవుడ్, సాండల్‌వుడ్ ఇండస్ట్రీల్లో హాట్ టాపిక్‌గా మారింది. తనకు బ్రేక్ ఇచ్చిన నిర్మాణ సంస్థతో పాటు అత్యంత సన్నిహితులను కూడా సోషల్ మీడియాలో అన్‌ఫాలో చేయడం సంచలనంగా మారింది. ప్రత్యేకంగా 'కేజీఎఫ్', 'సలార్', 'కాంతార' వంటి భారీ చిత్రాలను నిర్మించిన హోంబలే ఫిల్మ్స్ అధికారిక ఖాతాను రిషబ్ శెట్టి అన్‌ఫాలో చేయడం అందరినీ ఆశ్చర్యానికి గురిచేసింది. అయితే ఆ సంస్థ అధినేత విజయ్ కిరగందూర్ వ్యక్తిగత ఖాతాను మాత్రం ఇంకా ఫాలో అవుతుండటం గమనార్హం. దీంతో సమస్య సంస్థతోనా? లేక నిర్వహణతోనా? అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఇది మాత్రమే కాదు, కన్నడ ఇండస్ట్రీలో తనకు అత్యంత సన్నిహితుడైన రాజ్ బి. శెట్టిను కూడా రిషబ్ అన్‌ఫాలో చేయడం మరింత చర్చనీయాంశమైంది. వీరిద్దరూ కలిసి ఎదిగిన స్నేహితులు కావడంతో ఈ పరిణామం ఇండస్ట్రీ వర్గాలను ఆశ్చర్యపరుస్తోంది. అదేవిధంగా 'కాంతార' చిత్రంలో నటించిన రుక్మిణి వసంత్‌ను కూడా అన్‌ఫాలో చేయడం ఊహాగానాలకు తావిస్తోంది. ఈ పరిణామాల నేపథ్యంలో నెటిజన్లు వివిధ కోణాల్లో చర్చిస్తున్నారు. ఇది నిజంగానే వ్యక్తిగత విభేదాల ఫలితమా? లేక కొత్త సినిమా ప్రమోషన్ కోసం వేసిన స్ట్రాటజీనా? అనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఇదిలా ఉంటే, రిషబ్ శెట్టి కెరీర్ ప్రస్తుతం పీక్స్‌లో ఉంది. కాంతార సినిమాతో జాతీయ స్థాయిలో గుర్తింపు పొందిన ఆయన, ఇప్పుడు వరుస భారీ ప్రాజెక్టులతో బిజీగా ఉన్నారు. ముఖ్యంగా జై హనుమాన్ చిత్రంలో హనుమంతుడి పాత్రలో కనిపించనుండటం ఆసక్తిని రేకెత్తిస్తోంది. అలాగే ఛత్రపతి శివాజీ మహారాజ్ బయోపిక్‌లో నటించేందుకు సిద్ధమవుతున్నారు. ఇలాంటి సక్సెస్ సమయంలో టీమ్ సభ్యులను సోషల్ మీడియా నుంచి దూరం పెట్టడం వెనుక అసలు కారణం ఏమిటనేది ఇప్పటికీ మిస్టరీగానే ఉంది.

ఆ స్టార్ డైరెక్టర్‌తో మరోసారి .. హిట్ మూవీకి సీక్వెల్ రానుందా

మంగాత్తా చిత్ర కాంబో రిపీట్ కానుందా? అంటే కోలీవుడ్‌లో అవుననే టాక్ వినిపిస్తోంది. స్టార్ హీరో అజిత్, దర్శకుడు వెంకట్ ప్రభులది హిట్ కాంబినేషన్ అన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. వీరి కాంబోలో 2010లో తెరకెక్కిన మంగాత్తా చిత్రం సంచలన విజయాన్ని సాధించింది. ఆ చిత్రంలో నటుడు అజిత్‌ను విలనిజంతో కూడిన స్టైలిష్ పాత్రలో చూపించి సక్సెస్ అయ్యారు డైరెక్టర్.దీంతో వీరి కాంబినేషన్ కోసం ప్రేక్షకులు ఎంతో ఆసక్తిగా ఎదురు చూస్తున్నారు. ఆ సమయం ఇప్పుడు రానుంది. దర్శకుడు వెంకట్ ప్రభు.. శివకార్తికేయన్ హీరోగా చిత్రం చేయనున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ విషయాన్ని నటుడు శివకార్తికేయన్ కూడా తెలిపారు. అయితే ఈ చిత్రం ప్రారంభంలో ఆలస్యం జరగనున్నట్లు తెలిసింది. దీంతో దర్శకుడు వెంకట్ ప్రభు ఇటీవల నటుడు అజిత్‌ను కలిసి కథ వినిపించినట్లు సమాచారం.అది ఆయనకు నచ్చడంలో అందులో నటించడానికి ఓకే చెప్పినట్లు తెలుస్తోంది. కాగా అజిత్ 2027 జనవరి వరకు చిత్రాల్లో నటించనని ఇంతకు ముందే ప్రకటించిన విషయం తెలిసిందే. అదేవిధంగా ఆయన 64వ చిత్రాన్ని గుడ్ బ్యాడ్ అగ్లీ చిత్రం ఫేమ్ ఆధిక్ రవిచంద్రన్ దర్శకత్వంలో నటించనున్నట్లు ప్రచారంలో ఉంది. దీంతో వెంకట్ ప్రభు దర్శకత్వంలో అజిత్ నటించే చిత్రం ఎప్పుడు ప్రారంభం అవుతుంది? దానికి సంబంధించిన వివరాలు ఏమిటి? అన్నది తెలియాలంటే మరికొద్ది కాలం ఆగాల్సిందే. ఇకపోతే ఇది మాంగాత్తాకు సీక్వెల్‌గా ఉంటుందా? లేక కొత్త కథా చిత్రంగా ఉంటుందా? అనే ఆసక్తి నెలకొంది.

జోడీ కుదిరింది

సల్మాన్ ఖాన్ హీరోగా వంశీ పైడిపల్లి దర్శకత్వంలో ఓ సినిమా రానుందని, ఈ చిత్రాన్ని 'దిల్' రాజు, శిరీష్ నిర్మించనున్నారనే టాక్ వినిపిస్తున్న సంగతి తెలిసిందే. ఇందులో సల్మాన్ ఖాన్ సరసన నయనతార నటించడం దాదాపు ఖరారైయిందని, కథ నచ్చి ఆమె ఒప్పుకున్నారని సమాచారం.ఈ జోడీ గురించి త్వరలోనే అధికారిక ప్రకటన రానుందట. ఇక ఈ సినిమా చిత్రీకరణను ఏప్రిల్ చివర్లో ప్రారంభించడానికి మేకర్స్ సన్నాహాలు చేస్తున్నారని తెలిసింది. వచ్చే ఏడాది రంజాన్ సందర్భంగా రిలీజ్ చేయాలని ప్లాన్ చేస్తున్నారని భోగట్టా. మరోవైపు ప్రస్తుతం సల్మాన్ 'మాతృభూమి' సినిమా చిత్రీకరణతో బిజీగా ఉన్నారు. ఈ సినిమా ఈ ఏడాదే విడుదల కానుంది.

Printed & Published And Owned by **YAMJALA PRAVEEN**, Printed at **SRI VENKATESWARA PRINTING SOLUTIONS** 11-1/B/42, BPM Green Lands Colony, Shabari Gardens Back, Parvathapur, Medipally Mandal, Peerzadiguda, GHMC, Medchal Malkajgiri, Telangana - 500098. Published from 4-33, Near Hanuman Temple, Allapur Village, Choutuppal Mandal, Yadadri Bhuvanagiri, Telangana - 508252. **Editor : YAMJALA PRAVEEN, PRGI No: TGTEL/26/A6221,** Ph. No: 9491134365. Email id: praveenyamjala1@gmail.com, Website: www.tholivelugu.com